Pubilshed from Kakinada

PRGI NO : APTEL/25/A1470

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కాకినాడ KAKINADA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 206 Issue No : 206 | ఆదివారం Sunday | జూన్ 14, 2026 14 JUNE 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



యుద్ధాన్ని ముగించేందుకు సమయం

## ఆసన్నమైంది మిత్రమా!

- నెతన్యాహుతో ట్రంప్
- ఇరాన్‌తో ఒప్పందం కొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం
- నెతన్యాహుకు ట్రంప్ ఫోన్‌లో స్పష్టమైన సందేశం
- 60 రోజుల కాల్పుల విరమణకు ప్రతిపాదనలు
- హార్మూజ్ జలసంధి పునఃప్రారంభం ప్రతిపాదన
- అణు కార్యక్రమంపై ఇరాన్‌తో మరిన్ని చర్చలు

**అమెరికా :** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశముందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. "ఇది మంచి ఒప్పందం.. యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది" అని నెతన్యాహుకు ట్రంప్ చెప్పినట్లు సమాచారం.అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని ఇరు దేశాల అధికారులు చెబుతున్నారు.

గతంలో ఇరాన్‌లో పాలన మార్పే లక్ష్యమని వాదించిన నెతన్యాహు.. ఇప్పుడు ట్రంప్ ముందుకు తీసుకెళుతున్న ఒప్పందాన్ని అడ్డుకోలేమనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ఆందోళనలను ఒప్పందంలో పరిగణనలోకి తీసుకుంటారని ట్రంప్‌పై తనకు నమ్మకం ఉందని ఆయన చెప్పినట్లు అధికారులు వెల్లడించారు.అయితే ప్రతిపాదిత ఒప్పందంపై ఇజ్రాయెల్ పూర్తిగా సంతృప్తిగా లేదని సమాచారం. ఆంక్షల సడలింపుతో ఇరాన్ చమురు విక్రయాలు పెంచుకొని ఆర్థికంగా బలపడొచ్చని, అదే సమయంలో అణు కార్యక్రమాన్ని పూర్తిగా

2 పేజీలో..



## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

**విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లొవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లొవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లొవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు.

- మిగతా 2లో..

సింగపూర్‌కు సీఎం

# చంద్రబాబు


## 15,16వ తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటన

- 2026 సీఐఐ పెట్టబడుల సన్నాహక రోడ్ షోలో పాల్గొననున్న సీఎం
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం వరుస భేటీలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్ తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు.

2 లో



# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ప్రస్తుతం చురుగ్గా కదులుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఓ ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. వీటన్నింటి ప్రభావంతో ఈ వీకెండ్ (జూన్ 14 ఆదివారం) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.



2 పేజీలో..



ప్రతి నియోజకవర్గంలో..

**ఎంఎస్ఎంఈ పార్కులు..**

# వేలాది ఉద్యోగాలు

- మంత్రి టీజీ భరత్
- పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్న భరత్
- కర్నూలులో నిర్వహించిన జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొన్నాయని వెల్లడి
- రిలయన్స్, అగస్త్య సంస్థలను కర్నూలుకు తీసుకువచ్చామన్న మంత్రి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈరోజు కర్నూల్‌లో పర్యటించిన మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు. కర్నూల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొన్నాయని, మొత్తం 1,460 ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

ఒక వ్యక్తికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని అన్నారు. ప్రతి మూడు నెలల కు ఒకసారి జాబ్‌మేళాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో పెట్టుబడులను

2 లో..



# గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

- పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి
- నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్
- ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు

**చండీగఢ్ :** పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు.

- మిగతా 2లో..

అమరావతి నిర్మాణాలపై తప్పుడు

# ప్రచారాలను నమ్మొద్దు

- మంత్రి నారాయణ
- హ్యాపీనెస్ట్ నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,393 మాత్రమే
- కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కంటే తక్కువ ఖర్చు
- గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే
- రాజధానిలో కొండవీటి వాగు, పాలవాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనులను పరిశీలించిన మంత్రి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నిర్మాణ వ్యయాలపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శనివారం అమరావతిలో పర్యటించిన మంత్రి కొండవీటి వాగు, పాలవాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాకాలంలో ఆయా బ్రిడ్జిల వద్ద నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు..ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి నిర్మాణాలపై వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే రాజధానిలో నిర్మిస్తున్న భవనాల వ్యయం పూర్తిగా సహేతుకంగానే ఉందని చెప్పారు. అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్ నివాస సముదాయాలకు రూ.984 కోట్లతో టెండర్ ఖరారైందని, నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు కేవలం రూ.3,393 మాత్రమే అవుతోందని తెలిపారు.



అలాగే గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణానికి రూ.1,003 కోట్లతో టెండర్ ఖరారైందని, చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే వ్యయం అవుతోందని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1,234 కోట్లతో టెండర్ ఖరారైందని, దాని నిర్మాణ

2 పేజీలో..



అన్ని ప్రాంతాలకూ

# అభివృద్ధి..

- హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం : మంత్రి సత్యకుమార్
- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్
- ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య
- ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

2 లో..

ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం
- అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది.

- మిగతా 2లో..

# హైదరాబాద్‌లో భారీ వర్షం

శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది



కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## ఎల్‌నినో కార్యాచరణ ఏదీ ?

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది.

దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

**తెలంగాణలో భారీ వర్షాలు..** ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లోనూ అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. ఈ రెండ్రోజులు (శని, ఆదివారం) కూడా జోరువానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. శుక్రవారం రాత్రి నుండి పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి... ఇవాళ (శనివారం) ఉదయం కూడా ఈ వర్షబీభత్సం కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు వాతావరణ నిపుణులు.

**ఈ తెలంగాణ జిల్లాలకు హైఅలర్ట్..** ఇవాళ (జూన్ 13, శనివారం) భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్,వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో కూడా చెదురుమదురు జల్లులు ఉంటాయని హెచ్చరించింది.

**ఎపిలోనూ వర్ష బీభత్సమే ...** దక్షిణ కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ (ఉూూణహీూ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో శనివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, బాపట్ల, పల్నాడు,



మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని... ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు.




## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు..వేలాది ఉద్యోగాలు

ఆకర్షించి ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ఓర్వకల్లుకు ఎన్నడూ లేనంతగా పరిశ్రమలు వస్తున్నాయని, రిలయన్స్, అగస్త్య సంస్థలను కర్నూలుకు తీసుకువచ్చామని వెల్లడించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి అభివృద్ధి సాధిస్తుందని మంత్రి భరత్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!



నిలిపివేయకపోవచ్చని ఇజ్రాయెల్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ.. అమెరికా తన ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందం కుదుర్చుకుంటున్నప్పటికీ ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణులు, అనుబంధ తీవ్రవాద సంస్థల విషయంలో తమ భద్రతా ఆందోళనలు కాపాడాలని ఆశిస్తున్నామని చెప్పారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికా-ఇరాన్ మధ్య త్వరలో ఓ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరే అవకాశం ఉంది. ఇందులో 60 రోజుల కాల్పుల విరమణ, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు కార్యక్రమంపై తదుపరి చర్చలకు మార్గం సుగమం చేసే అంశాలు ఉండనున్నాయి. అలాగే హర్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ పోర్టులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.



## అమరావతి నిర్మాణాలపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు



వ్యయం చదరపు అడుగుకు రూ.3,945గా ఉందని మంత్రి వెల్లడించారు. ఈ గణాంకాలను పోల్చి చూస్తే అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్, గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కంటే తక్కువగా ఉందని స్పష్టమవుతోందన్నారు. రాజధానిలో నిర్మిస్తున్న అనేక భవనాలు సాధారణ భవనాలు కాదని, రాష్ట్ర ప్రతిష్ఠను చాటే ఐకానిక్ నిర్మాణాలని మంత్రి తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, ఆధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, దీర్ఘకాలిక వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. అందువల్ల కొన్ని ప్రత్యేక భవనాలకు వ్యయం ఎక్కువగా కనిపించినా, వాటి నాణ్యత మరియు ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పార్లమెంట్ భవనం నిర్మాణం, తెలంగాణ సచివాలయం నిర్మాణం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయంలో కూడా మొదట పిలిచిన టెండర్ల అంచనాలతో పోలిస్తే పనులు పూర్తయ్యే సమయానికి వ్యయం పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే అమరావతి నిర్మాణాల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగులపై జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, రాజధాని నిర్మాణంలో వరద నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని, అందులో వాగులపై 43 బ్రిడ్జిలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జిల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి ప్రవాహ మార్గాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రిడ్జిల నిర్మాణం వల్ల నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గకుండా అన్ని సాంకేతిక ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాజధాని అభివృద్ధి మరింత వేగవంతం కానుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ఒకే ప్రాంతంలో పనిచేసే విధంగా అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు అమరావతి నిర్మాణాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, అభివృద్ధిని అడ్డుకునే విధంగా అసత్య ప్రచారాలు కొనసాగిస్తే ప్రజల నుంచి మరింత తిరస్కరణ ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

## సింగపూర్‌కు సీఎం చంద్రబాబు



వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సీబీఎన్ఏ361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్-అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీఈటీయమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం బృందం సింగపూర్ లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

## అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు



నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్,



రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం

# రీఛార్జ్ బావుల నిర్మాణం చేపట్టాలి

❖ గన్నవరం ముస్తాబాద్‌లో పైలట్ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి
❖ ఉపాధి హామీ పనుల పరిశీలన.. కూలీలతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

జిల్లాలో భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించి, భవిష్యత్ నీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి స్పష్టం చేశారు. శనివారం ఉదయం గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీఛార్జ్ బావి (రీఛార్జ్ షాఫ్ట్/ఇంజెక్షన్ వెల్) పనులను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు అమలు విధానం, నిర్మాణ వ్యయం, భూగర్భ జలాల పునరుద్ధరణకు చేకూరే ప్రయోజనాలపై అధికారులతో సమీక్షించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి సమర్థవంతంగా చేర్చేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముస్తాబాద్ ప్రాజెక్టు





ప్రీ-మాన్సూన్ కాలంలో భూగర్భ జల మట్టం 6 మీటర్ల కంటే లోతులో ఉన్న గ్రామాలను ఈ ప్రాజెక్టు కోసం గుర్తించారు.ప్రాజెక్టు వ్యయం: ఒక్కో రీఛార్జ్ షాఫ్ట్ నిర్మాణానికి సుమారు రూ. 2 లక్షల వ్యయం అవుతుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.జల ధార – జలహారతి: ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ గ్రామంలో 'జల ధార జలహారతి' కార్యక్రమం కింద పైలట్ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.తదుపరి ప్రణాళిక: ఇక్కడి అనుభవాలను క్రోడీకరించి, భూగర్భ జల శాఖ గుర్తించిన ఇతర ప్రాం తా ల్లోనూ వీటిని విస్తరిస్తామని అధికారులు వెల్లడించారు. కూలీల కష్టాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్..రీఛార్జ్ బావుల పరిశీలన అనంతరం కలెక్టర్ డీకే బాలాజి ముస్తాబాద్‌లోనే జరుగు తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) పనులను తనిఖీ చేశారు. పంటబోదె పూడికతీత పనులను పరిశీ లిస్తూ.. అక్కడే పనిచేస్తున్న ఉపాధి కూలీలతో కలెక్టర్ నేరుగా ముచ్చటించారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా? పనుల దగ్గర ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కూలీల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్, పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హాజరైన అధికారులు:ఈ పర్య టనలో జిల్లా కలెక్టర్ వెంట డ్వామా పీడీ ఎస్. శివప్రసాద్ యాదవ్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ గుణకర్, క్వాలిటీ కంట్రోల్, భూగర్భ జల శాఖ అధికారులు, తహసిల్దార్ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత మరియు క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ విద్య .. మారుతున్న ట్రెండ్స్

## విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళిక

**మారుతున్న సాంకేతికతతోనే ఉద్యోగ అవకాశాలు.. సరైన కోర్సు, కళాశాల ఎంపికే విజయానికి రాజమార్గం**

మచిలీపట్నం/రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

ప్రపంచీకరణ, నూతన సాంకేతిక విప్లవం కారణంగా నేటికీ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల మొదటి ప్రాధాన్యత ఇంజినీరింగ్ విద్యే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంజి నీరింగ్ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రభావంతో కోర్సుల రూపకల్పన నుంచి ఉద్యోగ అవకాశాల వరకు సరికొత్త ట్రెండ్స్ నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల అవగాహన కోసం మచిలీపట్నం వై.జె.ఆర్. డి.ఎమ్.ఎస్. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా.టి. రవి కుమార్ అందిస్తున్న ప్రత్యేక విశ్లేషణ...


**1. సరికొత్త కోర్సులు.. అప్డేటెడ్ కరికులమ్**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) లో వస్తున్న మా ర్పుల వల్ల BTech స్థాయిలోనే ఎన్నో అద్భుత మైన నూతన కోర్సులు అందుబాటులోకి వచ్చా యి.

ట్రెండింగ్ కోర్సులు: AI & ML (మెషిన్ లెర్నింగ్), AI & DS (డేటా సైన్స్), IoT (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), రోబోటిక్స్,క్వాంటం కంప్యూటింగ్ వంటి కొత్త కోర్సుల ప్రవేశానికి దారితీశాయి. ఐటీ మరియు సాఫ్ట్‌వేర్ పరిశ్రమల్లో మారు తున్న అవసరాలకు అనుగుణంగా యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో కోర్సుల పాఠ్య ప్రణాళికను (Curriculum) క్రమం తప్పకుండా అప్‌డేట్ చేస్తున్నారు. ఏ ఇంజినీరింగ్ విభాగానికైనా, AI సాధనాలు మరియు సాఫ్ట్‌వేర్ ఆధారిత పరిష్కారాలు ఇప్పుడు తప్పనిసరిగా మారాయి.

**2. సాంప్ర దాయ (కోర్) గ్రూపులకు సరికొత్త కళ**

AI సాంకేతికత పనిని సులువు చేయగలదే కానీ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి మౌలిక ఇంజినీరింగ్ విధులను భర్తీ చేయలేదు.కోర్ బ్రాంచ్‌లు (Civil, Mechanical, Electrical) ప్రెసిషన్ ఇంజినీరింగ్, భవన నిర్మాణం, GIS, ఆటోమొబైల్స్, మ్యానుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్ వంటి మార్పులకు అనుగుణంగా ఈ కోర్సులలో AI మరియు ఆటోమేషన్‌ను చేర్చారు.ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ECE): VLSI డిజైన్, డిజిటల్ కమ్యూనికేషన్స్, IoT లపై పట్టున్న వారికి సెమీకండక్టర్స్, చిప్ డిజైన్ & తయారీ, ఎలక్ట్రానిక్ ప్యాకేజింగ్ పరిశ్రమలలో విపరీతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి.



**3. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి – ఉపాధి వెల్లువ**

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమలకు లభిస్తున్న రాయితీలు BTech, డిప్లొమా విద్యా ర్థులకు సానుకూల సంకేతాలు ఇస్తు న్నాయి. కొత్త ప్రాజెక్టులు: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు కాబోతున్న 'క్వాంటం వ్యాలీ', ఇండస్ట్రియల్ SEZ పార్కులు, మరియు కొత్త రాజధాని ప్రాంత అభివృద్ధి వంటివి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు సరికొత్త మరియు భారీ అవకాశాలను సృష్టిస్తున్నాయి.

**4. విద్యార్థులకు ఉండాల్సిన కీలక నైపుణ్యాలు**

కేవలం ట్రెండ్ చూసి కాకుండా, తమ స్వంత బలాలు, ఆసక్తులను విశ్లేషించుకుని విద్యార్థులు కోర్సును ఎంచుకోవాలి. విద్యార్థులు ఈ కింది నైపుణ్యాలపై దృష్టి పెట్టాలిబేసిక్ స్కిల్స్ గణితం, అనలిటికల్ మరియు లాజికల్ థింకింగ్‌పై పట్టుండాలి. సృజనాత్మక, వ్యవస్థాపక (Entrepreneurial) ఆలోచనా శైలిని అలవర్చుకోవాలి.

ఐటీ అనుబంధ నైపుణ్యాలు: ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, సిమ్యులేషన్ & అప్లికేషన్ సాఫ్ట్వేర్, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ నైపుణ్యాలు ఉద్యోగ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయి.పరిశ్రమలకు అవసరమైన (Industry-ready) నైపుణ్యాలను పెంచేందుకు AICTE అన్ని విభాగాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను తప్పనిసరి చేసింది. కేంద్ర ప్రభుత్వ 'నూతన విద్యా విధానం' (NEP 2020) కూడా స్కిల్ డెవలప్మెంట్‌కు పెద్దపీట వేస్తోంది.

**5. తల్లిదండ్రులు – విద్యార్థులకు గమనిక:**

సరైన కళాశాల ఎంపిక ఎలా?కళాశాలను ఎంచుకునేటప్పుడు కేవలం ప్రచారాలను నమ్మకుండా కింది విష యాలను పరిశీలించాలి:మౌలిక వసతు లు: కళాశాల ల్యాబొరేటరీస్, మౌలిక సదు పాయాలు ఎలా ఉన్నాయి?అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ: బోధనా సిబ్బంది అర్హతలు, క్రమశిక్షణతో కూడిన క్యాం పస్ వాతావరణం.ట్రాక్ రికార్డ్: పూర్వ విద్యార్థుల (Alumni) స్థితిగతులు, నాణ్యమైన శిక్షణ మరియు ప్లేస్మెంట్ల రికార్డు.

**విజయానికి అడ్డదారులు లేవు !**"ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీఇంబ ర్స్మెంట్, స్కాలర్షిప్‌ల వల్ల ఈ రోజుల్లో పేద విద్యార్థులకు కూడా ఇంజినీరింగ్ విద్య ఎంతో సులభంగా అందుబాటులోకి వచ్చింది. అయితే, ప్రవేశం ఎంత సులభమో.. ఉద్యోగం సాధించడం అంతే నైపుణ్యంతో కూడుకున్నది. అవసరమైన ఉపాధి నైపుణ్యాలతో కోర్సును విజయవంతంగా పూర్తి చేయడానికి విద్యార్థికి ఎంతో అంకితభావం, కఠోర శ్రమ అవసరం. ఎందుకంటే విజయానికి ఎటువంటి అడ్డదారులు లేవు."- డా. టి. రవి కుమార్, ప్రిన్సిపాల్, వై.జె.ఆర్. డి.ఎమ్.ఎస్. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (YJR DMS College of Engineering)మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్ - 521002.
ఈమెయిల్: principal @yjrdmsce.ac.in




డా. టి. రవి కుమార్, ప్రిన్సిపాల్, వై.జె.ఆర్. డి.ఎమ్.ఎస్. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్
(YJR DMS College of Engineering)
మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్ - 521002.
ఈమెయిల్: principal@yjrdmsce.ac.in

# రెండేళ్ల కూటమి పాలనలో స్పష్టమైన సంక్షేమం, అభివృద్ధి ఫలితాలు

❖ టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ❖ వైసిపి విధ్వంసక పాలన నుంచి వేగంగా కోలుకుంటున్న రాష్ట్రం ❖ సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు దిశగా అడుగులు ❖ పత్రికా విలేకరుల సమావేశంలో టిడిపి నేతల వెల్లడి

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విశేష పురోగతి సాధించిందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పేర్కొ న్నారు. గత వైసిపి ప్రభుత్వ విధ్వంసక పాలనతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.శనివారం కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రి కా సమా వేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలోని ముఖ్య విశేషాలు ఇలా ఉన్నాయి:




**హామీల అమలులో రికార్డు..సూపర్ సిక్స్ ప్రగతి:** ఎన్ని కల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో దాదాపు 90 శాతం అమలు దశకు చేరుకోవడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం.

**ప్రత్యక్ష లబ్ధి:** తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 వంటి పథకాల ద్వారా కోట్లాది కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నాయి.

**పెన్షన్ల పెంపు:** సామాజిక పెన్షన్లను రూ.4,000కు పెంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం కొండంత ఆర్థిక భరోసా కల్పించింది. "గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల హామీలలో అధిక భాగాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైంది. ప్రజలను మభ్యపెట్టేలా అబద్ధపు ప్రచారాలు చేయడం, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం వైసిపి నాయకత్వానికి అలవాటుగా మారింది."అని గోపు సత్యనారాయణ అన్నారు.

**యువతకు ఉపాధి కల్పన:**గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురై యువత తీవ్ర నిరాశకు లోనైందని సత్యనారాయణ విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తూ మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ.పోలీస్ నియామకాల ప్రక్రియ వేగవంతం.నూతన పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ద్వారా యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

**జగన్ పుస్తకాలు వాస్తవాలకు దూరం:**వైసిపి అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇటీవల విడుదల చేసిన పుస్తకాలు, ప్రకటనలు అన్నీ వాస్తవాలకు క్రోశం దూరంలో ఉన్నాయని ఆయన మండిపడ్డారు.

వైసిపి ఐదేళ్ల తుగ్లక్ పాలనకు ప్రజలు ఇప్పటికే తమ ఓటు ద్వారా స్పష్టమైన తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా పనిచేస్తోందని తెలిపారు.

హాజరైన నేతలు:ఈ విలేకరుల సమావేశంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మొటమర్రి బాబా ప్రసాద్, మచిలీపట్నం టౌన్ మాజీ అధ్యక్షులు ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ క్లీన్ స్వీప్ అభినందనీయం

**స్వచ్ఛ నగరానికి సమర్థ పారిశుద్ధ్య నిర్వహణే పునాది**
**ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వి. నరసింహారావు**
**45వ డివిజన్‌లో ముమ్మరంగా సాగిన పారిశుద్ధ్య పనులు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

సమర్థ పారిశుద్ధ్య నిర్వహణే స్వచ్ఛ నగరానికి అసలైన పునాది అని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా పచ్చదనం, పరిశుభ్రత కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వి. నరసింహారావు కొనియాడారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్య క్రమంలో భాగంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని మెడికల్ అసోసియేషన్ హాల్ ఎదురుగా గల రోడ్డు మార్జిన్లను పారలతో చెక్కి, డ్రైనేజీ పూడికలను తీశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, రహదారులను ఊడ్చి సంపూర్ణంగా శుభ్రం చేశారు.ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యంఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వి. నరసింహారావు మాట్లాడుతూ... కూట మి ప్రభుత్వం అధికారులతో పాటు ప్రజలను కూడా మమేకం చేస్తూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు.మన డివిజన్ అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యం. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందర శుభ్రతను పాటిస్తే, మొత్తం డివిజన్ పరిశుభ్రంగా మారుతుంది. పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే అంటువ్యాధులు దరిచేరవు.వి. నరసింహారావు, ప్రిన్సిపాల్డివిజన్ ఇం చార్జ్ పి. వి. ఫణి కుమార్ ప్రతిరోజూ సచివాలయ, శానిటేషన్ సిబ్బందితో కలిసి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ చక్కటి సామాజిక కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కాలేజీ విద్యార్థులను, ఉపాధ్యాయులను భాగస్వాములను చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్‌తో పాటు కింది ప్రముఖులు మరియు సిబ్బంది పాల్గొన్నారు:మాచవరపు మానస (సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ) ఆర్.వి.ఎస్. మురళీధర్కొనకళ్ళ భాను ప్రసాద్మురాల నాగేంద్రంసచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది మరియు డివిజన్ స్వచ్ఛ సైనికులు.




# సర్ లో గుడివాడను నంబర్ వన్ స్థానంలో నిలపాలి

**ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్ళాలి**
**బి ఎల్ ఓ లతో మన బి ఎల్ వో లు సమన్వయం చేసుకుంటూ పనిచేయండి**
**పట్టణాల్లో 30%గుర్తించని ఓటర్లపై ప్రత్యేక నిఘా**
**సందేహాల నివృత్తికి 'ప్రజా వేదిక'లో ప్రత్యేక వ్యవస్థ:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై తెలుగుదేశం పార్టీ యంత్రాంగమంతా పూర్తి ఫోకస్ పెట్టి పనిచేయాలని, వెరిఫికేషన్ ప్రక్రియలో గుడివాడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు.శనివారం ఉదయం స్థానిక ప్రజా వేదిక కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జులు, టీడీపీ మండల అధ్యక్షులతో ఎమ్మెల్యే రాము ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న SIR ప్రక్రియ, ఓటర్ల మ్యాపింగ్, ఐడెంటిఫికేషన్, నూతన ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఆయన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.స్పీకర్ ఫోన్‌లో నిపుణులతో టాక్.. డౌట్స్ క్లియర్!సమావేశంలో క్లస్టర్ ఇంచార్జులు లేవనెత్తిన పలు సాంకేతిక, క్షేత్రస్థాయి సందేహాలను ఎమ్మెల్యే రాము అక్కడికక్కడే నిపుణులతో స్పీకర్ ఫోన్ ద్వారా మాట్లాడించి నివృత్తి చేశారు. బూత్ లెవెల్ ఏజెంట్లకు (BLA) ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించారు. ఈ ప్రక్రియకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రజావేదిక కార్యాలయంలో 10 మందితో కూడిన ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య సూచనలు:పట్టణ ఓటర్లపై ఫోకస్: గ్రామాల్లో ఓటర్ల మ్యాపింగ్ అధిక శాతం పూర్తయినా, గుడివాడ టౌన్‌లో ఇంకా 30 శాతం గుర్తించని ఓటర్లు ఉన్నారు. టౌన్ పరిధిలో పార్టీ శ్రేణులు చాలా అప్రమత్తంగా ఉండాలి. వలస ఓటర్ల గుర్తింపు: ఉద్యోగ, ఉపాధి రీత్యా వేరే ఊర్లలో ఉంటున్న స్థానిక ఓటర్లను గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలి.90% మ్యాపింగే లక్ష్యం: 90 శాతం పైగా ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. జూలై 14 లోపు వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలి.యువ ఓటర్ల నమోదు: యువత అంతా టీడీపీ వైపు సానుకూలంగా ఉన్నారని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్.. ఏ విధానంలోనైనా ఓటు నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.సమన్వయమే సక్సెస్ మంత్ర:"స్థానిక ఓటర్ల వివరాలపై మన బూత్ లెవెల్ ఏజెంట్లకు (BLA) పూర్తి అవగాహన ఉంటుంది. కాబట్టి క్షేత్రస్థాయిలో వచ్చే BLO (Booth Level Officer) లకు మన ఏజెంట్లు పూర్తి సహకారం అందిస్తూ, సమన్వయంతో వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి."— వెనిగండ్ల రాము, గుడివాడ ఎమ్మెల్యేసమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ విస్తృత స్థాయి సమావేశంలో గుడివాడ పట్టణ, రూరల్, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల టీడీపీ అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, వాసే మురళి, పోలవరపు వెంకట్రావు, దానేటి సన్యాసి రావు పాల్గొనగా.. గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పాల్గొన్నారు.అలాగే క్లస్టర్ ఇంచార్జులు ఉబ్బల వెంకటేశ్వరరావు, వల్లభనేని సుబ్బారావు, అడుసుమిల్లి శ్రీనివాస్, కొడాలి రామరాజు, సయ్యద్ జబీన్, మాదల సురేష్, నేరుసు కాశి, మధుసూదన్ రావు, బొంబాయి శ్రీను, పంచుమర్తి శ్రీనివాస్, మురళి క్రాంతి, ప్రదీప్, బద్రి, వంశీ, రాము, జానీలతో పాటు గుడివాడ తెలుగు యువత అధ్యక్షుడు లోయ విజయ్, టీడీపీ సీనియర్ నాయకులు చేకూరు జగన్మోహన్రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టింది

-జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు



ఏలూరు

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమ పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని ఆర్టీసీ విజయవాడ జోన్–2 చైర్మన్, ఏలూరు జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్ప లనాయుడు అన్నారు.శనివారం పార్టీ కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపము ఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోం దన్నారు.పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతు మరియు విద్యా సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా కొనసా గుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపించిన ఆయన, కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు.రాష్ట్ర అభివృద్ధిని చూసి కొంద౦రు కుల, మతాల పేరుతో విద్వేష రాజకీయాలు చేస్తున్నారని విమర్శించిన రెడ్డి అప్పలనాయుడు, ప్రజలు ఇప్పటికే వైసీపీకి తీర్పు ఇచ్చారని, 2029 ఎన్నికల్లో కూడా గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## రహదారి భద్రతకు ఆశ్రం హాస్పిటల్ చేయూత

-పోలీసులకు 20 ట్రాఫిక్ బారికేడ్ల అందజేత




ఏలూరు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆశ్రం మెడికల్ కాలేజీ మరియు హాస్పిటల్ యాజమాన్యం పోలీసు శాఖకు 20 ట్రాఫిక్ బారికేడ్లను అందజేసింది. ఈ బారికేడ్లను ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్‌కు ఆశ్రం హాస్పిటల్ ప్రతినిధులు అందించారు.నగరంలోని ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న జంక్షన్ల వద్ద ఈ బారికేడ్లను ఏర్పాటు చేసి రహదారి భద్రతను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశ్రం హాస్పిటల్ సీఈఓ డా. కె. హనుమంతరావు,ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్, ఐ/సి ఎమర్జెన్సీ డాక్టర్ డా. ప్రణయ కృష్ణ, జనరల్ మేనేజర్ బాల రాజశేఖర్ (కెన్న), ఏలూరు ప్రెస్ ఫారం అధ్యక్షులు డి. వి. రమణ పాల్గొన్నారు.సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రమాదాల నివారణ చర్యల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమని డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.ప్రమాదాల నివారణలో పోలీసులకు సహకరించిన ఆశ్రం సంస్థ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు ఇతర సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

-జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్



ఏలూరు

జిల్లాలో నిర్వహించిన ఆప్కాస్ (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగుల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు.ఉద్యోగుల సంక్షేమం,అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లుగా 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించడం,పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలు (డీఏలు) విడుదల చేయడం, మూడు సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బకాయిలను చెల్లించడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడం, హెల్త్ కార్డులు మంజూరు చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు.అదేవిధంగా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం పెండింగ్ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని, లేకపోతే రాష్ట్ర జేఏసీ తీసుకునే నిర్ణయం మేరకు ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ ఉద్యమాలకు ఉద్యోగులందరూ సమాయత్తం కావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.సదస్సులో జిల్లాలోని పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయవంతం

- స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్రం పురోగమిస్తోంది
- నామా సురేంద్ర కుమార్

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని కొవ్వూరు నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు నామా సురేంద్ర కుమార్ అన్నారు.శనివారం తాడిపూడి గ్రామానికి చెందిన సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, పెట్టుబడుల ఆకర్షణతో పాటు



యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు విశేష సేవలు అందిస్తోందన్నారు.సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్లు, మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తున్నాయని, వాటి ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని చెప్పారు. అలాగే డీఎస్సీ ద్వారా 16 వేల మంది అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం మరింత బలంగా ముందుకు సాగి రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని నామా సురేంద్ర కుమార్ అన్నారు.

## దివ్యాంగులకు వాకర్స్ పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదేవరపేట గ్రామానికి చెందిన చిన్నం సుబ్రహ్మణ్యంకి, గోపవరం గ్రామానికి చెందిన కంకటి జాన్ కి ఏ ఎస్ ఓ జోడాల వెంకటేశ్వరావు, అంకబాబు, ప్రవీణ్ సహకారం తో అందించడం జరిగింది. జోడాల వెంకట్ గారు మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన కుత్రిమ అవయవాలు కావలిసిన వారు దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ నీ 9391089381 సంప్రదించిన వారికి జైపూర్ లెగ్స్, కాలిపర్స్, ప్రోస్తటిక్ లెగ్స్, వాకర్స్ ఉచితముగ అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీమ్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, జోడాల వెంకటేశ్వరరావు, రుచిర్, గౌతమ్, రవికుమార్ లు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

### 3ఏళ్ల పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి–ఏటపాక

మండల పరిధిలోని లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు పూర్తి చేసుకుని పాఠశాలకు వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 3 సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీలో చేర్పించాలని, బాల్య దశలోనే పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ముఖ్యమని అధికారులు తెలిపారు.కార్యక్రమానికి కణితి మధు , సచివాలయ మహిళా పోలీస్ శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులకు రెండో ఇల్లు లాంటివి. ఇక్కడి నుంచే మంచి అలవాట్లు, విద్యకు పునాది పడుతుంది అని ఆమె పేర్కొన్నారు. మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీ ద్వారా అందే పౌష్టికాహారం, టీకాలు, ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం 5ఏళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ గౌన్లు , టోపీలు ధరింపజేసి సర్టిఫికెట్లు , బహుమతులు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రొయ్యల దాణా ధరలు పెంపు విరమించాలి

- లేదంటే 16న రాష్ట్రవ్యాప్త రొయ్య రైతుల నిరసనలు
- రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు హెచ్చరిక

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

రాత్రికి రాత్రే ప్రభుత్వ అనుమతి లేకుండా దొడ్డిదారిన అక్రమంగా పెంచిన రొయ్యల దాణా ధరలు పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి లేదంటే ఈ నెల 16వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రొయ్యల సాగు రైతులంతా రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏపీ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం కార్యవర్గ సమావేశంలో గాంధీ భగవాన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అప్పడాకు సంబంధించి కమిషనర్, డైరెక్టర్ లకు తెలియకుండా అర్ధరాత్రి టైగర్ కంపెనీ కిలోకూరు. 12/–, వనామి రూ.10 పెంచడం దుర్మార్గం చర్య అని అన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం సంబంధించి అప్పడ, రైతు సంఘం, లను పట్టించుకోకుండా ఏకపక్షంగా దాణా ధరలు పెంచడం పై లీగల్ గా కూడా వెళ్తామని గాంధీ రాజు హెచ్చరించారు. మేత ధరలు పెంపునకు నిరసనగా మంగళవారం నాడు



ప్రతి ఆక్వా రైతు రోడ్డుపైకి వచ్చి ఎక్కడికి అక్కడ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని రైతుల బాధలు ప్రభుత్వానికి తెలిసేలా నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి టి నాగభూషణం మాట్లాడుతూ సిండికేట్ దారులు ప్రభుత్వాన్ని మోసగించి ధరలు పెంచిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ సహకారంతో ఎక్కడికక్కడ కోల్డ్ స్టోరేజ్ లు సంఘం తరఫున నిర్మించుకుని గిట్టుబాటు ధరలు వచ్చిన తర్వాత సరుకులు విక్రయించుకునే విధంగా ప్రణాళికలు చేసుకోవాల్సిందని తెలిపారు. అలాగే డొమెస్టిక్ సేల్స్ ఎక్కడికి అక్కడ పెంచుకోవాలన్నారు. సమావేశంలో మేడిది జాన్ దేవిడ్ రాజు, పి సత్యనారాయణ రాజు, అంగర విజయప్రసాద్, కృష్ణ శ్రీ తదితర రాష్ట్ర సంఘంజిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు


- గ్రామ అభివృద్ధి అధికారుల నెత్తిపై పెట్టుబడుల భారం
- అప్పులు పాలు అవుతున్నామంటూ ఆవేదన

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

ఏపీ గ్రామపంచాయతీలలో గ్రామ సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 తోటే పూర్తయి పోవడంతో ప్రత్యేక అధికారులు పాలన వచ్చింది. ఏపీ రాష్ట్రవ్యాప్తంగా 12, 321 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.గతంలో గ్రామములో. శానిటేషన్, మంచినీటి సరఫరా, విద్యుత్తు తదితర అత్యవసర సౌకర్యాలు కల్పన కోసం సర్పంచులు పెట్టుబడి పెట్టేవారు. తర్వాత బిల్లులు చేయించుకునేవారు. అయితే సర్పంచులు లేకపోవడంతో ఈ పెట్టుబడులన్నీ గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి పై పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అత్యవసర పనులు చేయించడానికి గ్రామ అభివృద్ధి అధికారులకు తలకు మించిన భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దీనివల్ల అప్పుల పాలు అయిపోతున్నామని పలువురు వాపోతున్నట్లు సమాచారం. గ్రామంలో అత్యవసర పనులకు చేసిన సొమ్ములను గాని, కొందరి సిబ్బంది జీతాలు గాని తీసుకోవడానికి వీలు లేకుండా జిల్లా అధికారులు లాగిన్ కు ముడి పెట్టడంతో జీతాలు, చేసిన పనులకు సొమ్ములు తీసుకోవడానికి వీలు లేక గ్రామాల్లో పనులు నిలిచిపోతున్నాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్లు వచ్చాయని సంతోషపడాలో ఇబ్బందులు పెరిగాయని మనస్థాపం చెందాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు.

**పాత పద్ధతిలోనే చెల్లింపులు జరగాలి**

గతంలో ప్రత్యేక అధికారి హోదాలో చెక్కులు మార్చడానికి వీలు ఉండేది. ఇప్పుడు చేసిన పనులకు, కొందరు జీతాలు తీసుకోవడానికి డి ఎల్ పి ఓ, డి పి ఓ అప్రూవల్ కావలసి ఉండడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని పలువురు అంటున్నారు. కొంతమంది సిబ్బంది జీతాలు కూడా ఆరు నెలలకు పైబడి ఇవ్వకపోవడంతో సిబ్బంది గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి రావడం లేదని మరికొందరు అంటున్నారు. కావున గతంలో మాదిరిగా పాత పద్ధతిలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులకు, సిబ్బంది జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## శ్రామికుల శ్రమకు మంత్రి నిమ్మల ఘన గౌరవం

### రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

రామానాయుడు పేదల సేవే లక్ష్యంగా పాలకొల్లు నియోజకవర్గంలో ఉపాధి హామీ శ్రామికుల శ్రమను గుర్తించి వారికి ప్రత్యేకంగా గౌరవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామంలో శనివారం గత 50 రోజులకు పైగా మండుటెండలో కష్టపడి పనిచేసిన శ్రామికులకు ముగింపుగా ఆప్యాయత భోజనాలను ఏర్పాటు చేశారు. ఆయన సామాన్య కార్యకర్తగా స్వయంగా భోజన టేబుల్స్ ను వేయడంతోపాటు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శ్రామికులతో కలసి సమయం గడిపిన మంత్రి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.లక్కీడ్రా ద్వారా మహిళా శ్రామికులకు చీరలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచారు. మంత్రి పిలుపుతో దాతల సహకారంతో గత 50 రోజులకు పైగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ శ్రామికులకు చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెడుతోందని మంత్రి తెలిపారు. రెండు సంవత్సరాల పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. విష రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాల ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేస్తూ మాట నిలబెట్టుకున్నారని



తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు అందిస్తున్నామని వివరించారు. మహిళలకు సంవత్సరానికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈఓ వీరాస్వామి, నాయకులు పాముల రజిని కుమార్, పెనుమత్స శ్రీనివాసరాజు, వీరమల్లు శ్రీనివాసరావు అందేశ్వరరావు, కుప్పల సత్యనారాయణ,ఎల్లపు లోకేష్, గూడవల్లి సంజీవుడు వేల్పూరి సతీష్, మెరిపే కిషోర్, మోతుకూరి ప్రసన్నకుమార్, అందే కోటి వీరభద్రరావు, వేండ్ర బుద్దేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పునరుద్ధరించాలి

### బీజేపీ ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేత

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన "జనతా వారిది" కార్యక్రమంలో భాగంగా రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మరియు తూర్పు గోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షులు పిక్కి నాగేంద్రలను కలిసి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పీజీ విద్యార్థుల సమస్యలపై మల్లిపూడి రాజేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పీజీ విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిలిపివేయబడటంతో వేలాది మంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమ య్యారని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు ఉండటం, కుటుంబాల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో అనేక మం ది విద్యార్థులు తమ చదువులను కొనసా గించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలి పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం లోకి



వచ్చిన తర్వాత పీజీ విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ పథకం పునరుద్ధరించబడు తుందనే ఆశతో విద్యార్థులు, వారి కుటుం బాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పీజీ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని తిరిగి అమలు చేయాలని ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం సమర్పిం చినట్లు తెలిపారు.వినతిపత్రంపై స్పందించిన పురందేశ్వరి, ఈ సమస్యను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# డబల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్

## పట్టణ అభివృద్ధికి మంత్రి కొలుసు పార్థసారధి కృషి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు చేస్తున్న కృషినీ ప్రజలకు వివరించాలని బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ బిజెపి పార్టీ కార్యనిర్వాహ కులు మల్లెపూడి రాజశేఖర్ పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. శనివారం నూజివీడులో జరిగిన బిజెపి పట్టణ కార్యవర్గ సమావేశానికి అయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేత్రుత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా సుపరిపాలన అందిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం, వైజాగ్ లో పారిశ్రామికాభివృద్ధి, మహిళలస్వయం సమృద్ధి, బడుగు బలహీన వర్గాలకు గృహ నిర్మాణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయానికి చేయూత, పోర్థుల నిర్మాణం, జాతీయ, గ్రామీణ రహదారుల నిర్మాణం, విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు వంటి బృహత్తర కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల పాలన పూర్తిచేసుకుందని రాజశేఖర్ అన్నారు. అన్ని రంగాలలో నూజివీడు పట్టణ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి చేస్తున్న కృషిఅభినందనీయమన్నారు. నియోజకవర్గ కూటమి సమన్వయకర్త, సర్ కార్యక్రమ ఇంచార్జ్ మాటూరి రవికాంత్ మాట్లాడుతు 15 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల సవరణ కార్యక్రమంలో ఎంపిక చేసిన బిఎల్ ఓ 2 లు



తమ తమ పోలింగ్ బూత్ పరిధిలో జరిగే ఇంటింటి సర్వే కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మల్లెపూడి రాజశేఖర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బోను అప్పారావు, శివరాజు వసుంధరదేవి, జిల్లా బిజెపి కోశాధికారి మాటూరి రవికాంత్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు, మీడియా కో కన్వీనర్ మానూరు ప్రసాద్, మహిళా మోర్చా జిల్లాఉపాధ్యక్షురాలు మానూరు పద్మావతి, రాయపాటి లీలా విజయ జ్యోతి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు రెడ్డి మురళీ మోహనరావు, అంబటి మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు దద్దనాల రవికిషోర్, దోసపాటి రవికిషోర్, కార్యదర్శి వరాటి బాలు, యోగ కుమార్, అది నాగ కుమార్, పట్టణ మహిళా, యువ, మైనార్టీ, కిసాన్, ఓబీసీ మోర్చాల అధ్యక్షులు షేక్ బాజీమా, రాజేంద్ర కుమార్, షేక్ రఫీ, చాట్రాతి సూర్యప్రకాష్, శంకర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకి సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పూర్తి స్థాయి అందజేయాలి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ముఖ్యుల సమావేశం. జిల్లా కమిటీ సభ్యుడు సి.చ్ చరణ్ అధ్యక్షతన ఈరోజు పి.డి.ఎస్.యు కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు కాకినాని మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు కి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఏదైతే ప్రభుత్వం ఇస్తానన్నటువంటి సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పూర్తిస్థాయిలో రాలేదని, కేవలం పుస్తకాలు మాత్రమే ఇచ్చారని నాని తెలిపారు. అయితే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కి పబ్లిసిటీ మీద ఉన్నటువంటి శ్రద్ధ విద్యార్థులకు అందజేసినటువంటి కిట్ల పంపిణీ మీద లేక పోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని నాని





అన్నారు అదేవిధంగా విద్యార్థులకు ఏదైతే యూనిఫామ్ సంబంధించి మూడు జతలు ఉన్నాయో ఒక్కో జతకి 40 రూపాయలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తల్లి అకౌంట్లో డబ్బులు వేయడం జరుగుతుందని జతకి 40 రూపాయలు ఏ విధంగా సరిపోతాయని అధికారులను నాని ప్రశ్నించారు. ఈరోజు బయట ఒక జత కుట్టించుకోవాలంటేనే 200 నుంచి 500 రూపాయలు వసూలు చేస్తున్నారని అలాంటప్పుడు 40 రూపాయలు ఏ విధంగా సరిపోతాయని అన్నారు కావున జతకి 200 కనీసం ఇవ్వాలని నాని కోరారు. అదేవిధంగా ఏలూరు జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు ఒక్క బ్రాంచికి పర్మిషన్ తీసుకొని మూడు నాలుగు బిల్డింగుల్లో క్లాసులు అనధికారంగా నిర్వహిస్తున్న మండల స్థాయి విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నాని ప్రశ్నించారు. అదేవిధంగా పార్టీ పుస్తకాల పేరుతో వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్న విద్యాశాఖ అధికారులకు కంప్లైంట్ ఇస్తున్నప్పటికీ కూడా ఎక్కడా కూడా చర్యలు తీసుకుంటున్నటువంటి దాఖలాలు కనబడటం లేదని కావున జీవో ఎంఎస్ నెంబర్:1 కచ్చితంగా పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు నాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ కే రయాన్, ఎం. యశ్వంత్, సొంగ సునీల్, వై.ఆనంద్ , సిహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జీయూకేటీ ప్రొవిజనల్ ఎంపిక జాబితా విడుదల

ప్రజభూమి ప్రతినిధి-నూజివీడు

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, ఆంధ్రప్రదేశ్ 2026-27 విద్యా సంవత్సరానికి ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ కార్యక్రమంలో ప్రవేశాల కోసం ప్రొవిజనల్ ఎంపిక జాబితాను విద్యాశాఖ మంత్రి, శ్రీ నారా లోకేష్ విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరానికి మొత్తం 44,104 దరఖాస్తులు అందాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నుండి 25,406 దరఖాస్తులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుండి 17,798 దరఖాస్తులు, అలాగే ఇతర రాష్ట్రాల నుండి 900 దరఖాస్తులు అందాయి. సాధారణ సీట్లు 3640 మరియు జుబొా సీట్లు 400, మొత్తం 4040 సీట్లకు ప్రొవిజనల్ ఎంపిక జాబితాను విడుదల చేశారు. ప్రత్యేక కేటగిరీల ఫలితాలు విడిగా ప్రకటించబడతాయి. ఈ సంవత్సరం ఎంపికల్లో ప్రధాన విశేషం ఏమనగా, ఎంపికైన 4040 మంది అభ్యర్థులలో 3907 మంది, అంటే 96.7 శాతం, ప్రభుత్వ పాఠశాలలకు చెందినవారు. గ్రామీణ ప్రాంతాల మరియు ప్రభుత్వ పాఠశాలల ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆర్‌జీయూకేటీ లక్ష్యాన్ని ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 133 మంది అభ్యర్థులు, అంటే 3.3 శాతం, ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులలో 2855 మంది బాలికలు, అంటే 70.66 శాతం, మరియు 1185 మంది బాలురు, అంటే 29.33 శాతం, ఉన్నారు. ఎంపిక జాబితాలో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులు విశేష ప్రతిభ కనబరిచారు. బాపట్ల జిల్లా కొల్లూరు జెడ్.పి. గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన బవిరెడ్డి దివ్య తేజ శ్రీ 596 మార్కులు సాధించి ఎంపికైన అభ్యర్థుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే పలువురు అభ్యర్థులు 595 మరియు 594 మార్కులు సాధించడం ద్వారా ఈ సంవత్సరం ప్రవేశాల పోటీ స్థాయిని తెలియజేస్తోంది.



క్యాంపస్‌ల వారీగా కౌన్సెలింగ్ షెడ్యూల్ ఈ క్రింది విధంగా ఉంటుంది, నూజివీడు క్యాంపస్: 2026 జూన్ 19 మరియు 20 తేదీలలో నూజివీడు క్యాంపస్, నూజివీడు, ఏలూరు జిల్లా. ఆర్.కె. వ్యాలీ క్యాంపస్: 2026 జూన్ 19 మరియు 20 తేదీలలో ఆర్.కె. వ్యాలీ క్యాంపస్, ఇడుపులపాయ, కడప జిల్లా ఒంగోలు క్యాంపస్: 2026 జూన్ 22 మరియు 23 తేదీలలో ఆర్.కె. వ్యాలీ క్యాంపస్, ఇడుపులపాయ, కడప జిల్లా. శ్రీకాకుళం క్యాంపస్: 2026 జూన్ 23 మరియు 24 తేదీలలో శ్రీకాకుళం క్యాంపస్, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా. తరగతులు 01.07.2026 నుండి ప్రారంభం కానున్నాయి. ఎంపికైన అభ్యర్థులందరికీ తెలియజేయునది ఏమనగా, ఈ ఎంపిక ప్రొవిజనల్ మాత్రమే. అసలు ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మాత్రమే ప్రవేశం ఖరారు చేయబడుతుంది. కావున ఎంపికైన అభ్యర్థులు నోటిపై చేసిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత కౌన్సెలింగ్ కేంద్రాలకు అవసరమైన అన్ని అసలు ధ్రువపత్రాలు మరియు పత్రాలతో హాజరు కావాలి. విద్యాశాఖ మంత్రి, శ్రీ నారా లోకేష్, ఆర్‌జీయూకేటీ-ఏపీ చాన్సలర్ ప్రొఫెసర్ కె. మధు మూర్తి గారు మరియు వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. రావు ఎంపికైన అభ్యర్థులందరికీ హృదయపూర్వకఅభినందనలు తెలియజేసి, వారికి ఉజ్వలమైన విద్యా భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు.

# సేవా రంగంలో మరో అరుదైన గౌరవం



## డీసీ చైర్మన్ మెర్లకి ఉత్తమ సేవా పురస్కారం. - రాజమండ్రిలో ఘన సత్కారం.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ప్రజాసేవనే పరమావధిగా భావించి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామికి మరో అరుదైన గౌరవం లభించింది. రాజమండ్రిలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ప్రతిష్టాత్మక ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం చేశారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, సామాజిక అభివృద్ధి రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తుండగా, ఈ ఏడాది మెర్ల గోపాలస్వామి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ప్రస్తుతం డీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గోపాలస్వామి రైతుల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తున్నారు. సాగునీటి సమస్యలు, కాలువల నిర్వహణ, నీటి పంపిణీ, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో రైతులకు అండగా నిలుస్తూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపుతున్నారు. గ్రామాల వారీగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను నేరుగా తెలుసుకుని స్పందించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. అలాగే సామాజిక, సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు. సేవాభావంతో నిరంతరం ముందుకు సాగుతున్న ఆయనకు ఉత్తమ సేవా పురస్కారం లభించడం పట్ల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెర్ల గోపాలస్వామిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ ఇదే సేవాస్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువై మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మెర్ల గోపాలస్వామి పేర్కొన్నారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామిని పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నేతలు, అభిమానులు అభినందించారు. ప్రజా సేవలో ఆయన చూపుతున్న అంకితభావం, రైతు సంక్షేమం కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగానే ఈ పురస్కారం లభించిందని పేర్కొంటూ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సాగునీటి కోసం పొడగట్లపల్లి రైతుల ఎదురు చూపులు

## తూము పూడిక తొలగించి సాగునీరు అందించాలని వినతి.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

గన్నవరం పెద్ద కాలువ నుంచి పంట పొలాలకు సాగునీరు అందించే తూము పూడికతో నిండిపోవడంతో ఆయకట్టుకు నీరు చేరడం లేదని రావులపాలెం మండలం పొడగట్లపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జుత్తుగపాడు నవజీవన నగర్ వద్ద గన్నవరం పెద్ద కాలువ నుంచి పంట పొలాలకు నీరు అందించేందుకు తూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ తూము ద్వారా మెట్ట చేలు, ఊడుపు చేలు కలిపి సుమారు 120 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని రైతులు పేర్కొన్నారు. అయితే గత రెండేళ్లుగా తూము నుండి సుమారు 400 వందల మీటర్లు పూడికతో నిండిపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయిందని చెప్పారు. కాలువలకు నీరు విడుదల చేసి రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఆయకట్టుకు నీరు చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఇప్పటి వరకు నారుమడులు కూడా వేయలేని పరిస్థితి



నెలకొందని తెలిపారు. సంబంధిత అధికారు లు వెంటనే స్పందించి తూములోని పూడిక, అడ్డంకులను తొలగించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు అండగా నిలవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# ఒత్తిడిని జయించాలంటే యోగ అవసరం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏ ఆర్ అదనపు ఎస్పీ జీ..ముని రాజా ఆదేశాలపై ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ సిబ్బంది ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురు ప్రవీణ్ చిన్నారెడ్డి, కే వినోద్ కుమార్ యొక్క సారధ్యంలో సామూహిక యోగాసనాల సాధన కార్యక్రమం నిర్వహించారు. యోగా వేడుకల్లో పాల్గొన్న యోగా గురువులు యోగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఏ ఆర్ ఆర్ ఐ సతీష్ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే పోలీసు సిబ్బందికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో యోగా అత్యంత ప్రాధాన్యతను సంత రించుకుందని, ప్రపంచ వ్యాప్తంగా యోగాను గుర్తించి ఆచరిస్తు న్నారని ఆయన తెలిపారు. యోగా సాధన ఒత్తిడి, ఆందోళనల నుండి ఉపశమనం కలిగించి, ప్రతి ఒక్కరూ మానసికంగా, భౌతికం గా దృఢత్వం కలిగి ఉండటానికి సహాయ పడుతుందని చెప్పారు. సిబ్బందిలో యోగా ప్రాముఖ్యతను తీసుకెళ్లేందుకు జిల్లా పోలీసు శాఖ నిర్వహించనున్న ఈ “యోగా కార్యక్రమంలో భాగంగా యోగా యొక్క ప్రాముఖ్యతను విస్తృతంగా తీసుకెళ్ల డానికి ఎస్పీ యొక్క ఆదేశాలపై జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్, ఆర్. ఎస్ ఐ భాస్కర రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. శనివారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విన్నారు. ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే, ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీకి కాజులూరు ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు ఆణిముత్యాలు ఎంపిక.

-పలువురు అభినందనలు.







ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఈమేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మొదటగా గీసాల తేజ శ్రీ రమ్య నూజివీడు ట్రిపుల్ ఐటీ కి, బొల్లం సాయి వంశీ ,యాళ్ళ లీలా హారిక లు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు తెలిపారు. వీరితో బాటు మరో నలుగురు రెండు, మూడు రౌండ్లలో ఎంపికయ్యే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు అత్యున్నత ప్రతిభను కనబరిచి ఎక్కువ సంఖ్యలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించాలని అన్నారు. ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్ధరాజు, స్టాప్ సెక్రటరీ హరినాథ్, సీనియర్ ఉపాధ్యాయులు భాస్కర సత్య ప్రసాద్, లక్ష్మీ కామేశ్వరి, వల్లీ భాషా, రాజ రాజేశ్వరి తదితర ఉపాధ్యాయులు ఈసంధర్భంగా వీరిని అభినందించారు.

# మహిళల భద్రత మన బాధ్యత

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం



మహిళల భద్రత కేవలం పోలీసులు లేదా ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కుటుంబం, సమాజం, మరియు కార్యాలయాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందనీ, ఎస్ఐ సాదిక్ అన్నారు. శని వారం స్తానిక విఆర్ పురం గ్రామంలో మహిళలకు సంబంధించి, ద్విచక్ర వాహనదారులకు సంబంధించి, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న విషయాలు, వాటిని ఏ విధంగా ఎదుర్కో వాలి వాళ్లకున్న చట్టాలు గురించి, ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడుపు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, హెల్మెట్ వాడకం వాహనాలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ గురించి స్తానిక ప్రజలకు ఎస్ఐ సాదిక్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లా డుతూ మీక్షేమం మాబాధ్యత అని అతివేగంగా వాహనాలు నడపరాదని, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, మైనర్లకు వాహనాలను ఇచ్చి డ్రైవింగ్ చేయించవద్దని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని, హెల్మెట్ లేకుండా టు వీలర్ డ్రైవింగ్ చేయరాదని తదితర అంశాలపై స్తానిక ప్రజలకు అవగాహన కల్పించారు.

## కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనం చేసుకున్న: ఎంపీ అంబికా



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర మంత్రి అచ్చయ్య నాయుడు తో కలిసి శనివారం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనం చేసుకుని, శ్రీ వారి ఆశీస్సులు పొందడం జరిగింది. ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, మన రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించాను. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామిని దివ్యదర్శనం చేసుకున్న వారు అనంతపురం మచ్చా నర్సింహులు, సత్య రామ్ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ ప్రధానిగా 12 సంవత్సరాలు ఒక రికార్డుల పాలన

### భారతీయ జనతా పార్టీ శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల కేంద్రంలో కుందు శ్రీనివాసులు రెడ్డిఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో మోడీ 12 ఏళ్ల రికార్డు పరిపాలన గురించి చర్చించుకోవడం మరియు స్వీట్లు పంచుకోవడం జరిగింది. నరేంద్ర మోడీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన దగ్గర్నుంచి ఇప్పటివరకు భారతదేశ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన పాలనలో ఒకటిగా నిలిచింది. ఈ 12 ఏళ్ళలో, మోడీ ప్రభుత్వం అనేక రికార్డులను సృష్టించింది, ఆర్థిక, సామాజిక, మౌలిక సదుపాయాలు, డిజిటల్ రంగాల్లో అద్భుతమైన మార్పు తీసుకొచ్చింది. ప్రధాని మోడీ 12 సంవత్సరాలు (4,399 రోజులు) నిరంతరం పనిచేసి, దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన ఎన్నికైన ప్రధానిగా రికార్డు సృష్టించారు. వరుసగా మూడుసార్లు విజయం సాధించిన ప్రధానిగా, 1952 తర్వాత నెహ్రూ రికార్డును అధిగమించిన రెండవ నాయకుడిగా చరిత్ర సృష్టించారు. గత 12ఏళ్లలో, ఆర్థిక వ్యవస్థ 2.1 ట్రిలియన్ నుండి 4.18 ట్రిలియన్ కు పెరిగి, భారత దేశాన్ని ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపింది. వస్తు సేవల పన్ను వంటి సంస్కరణలు ద్వారా ఆర్థిక వ్యవస్థను మెరుగు చేశారు. సాంఘిక సంక్షేమ పథకాలు కూడా భారీ స్థాయిలో అమలయ్యాయి. ప్రధాని ఆవాస్ యోజన కింద 4 కోట్లకు పైగా గృహాలు నిర్మించగా, ప్రధాని గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందించబడ్డాయి. జల్ జీవన్ మిషన్ మరియు ఉజ్వల యోజన ద్వారా ప్రభుత్వ డేటా ప్రకారం 25 కోట్ల మంది ప్రజలు సంపూర్ణ పేదరికం నుండి బయటపడ్డారు. బహిరంగ మలవిసర్జన రహిత భారతదేశం లక్ష్యం కూడా సాధించబడింది. 2019లో ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, జమ్మూకశ్మీర్లో ఉగ్రవాద సంఘటనలు గణనీయంగా తగ్గాయి, మరియు నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలు గణనీయంగా తగ్గాయి. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' వైపు నిర్ణయాత్మక చర్యలు తీసుకోబడ్డాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమం దేశాన్ని రూపు మార్చింది. ప్రస్తుతం 100 కోట్ల మందికి పైగా భారతీయులు ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీద్వారా లక్షల కోట్ల రూపాయల మోసాలను నిరోధించగలిగింది. ప్రజాస్వామ్య సంస్థల పక్షపాతం మరియు బహుళ ప్రజాస్వామ్య పునాదులపై ఒత్తిడి గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. పొరుగు దేశాలతో సంబంధాలు కూడా ఎప్పటికప్పుడు సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామ్మోహన్, తిరునగరి ఆంజనేయస్వామి, రామనాథ రెడ్డి, రామ శేఖర్ రెడ్డి, ఉత్తమ రెడ్డి, రామ్ రెడ్డి నరసింహారెడ్డి, శ్రీనాథ్ యాదవ్, మధుసూధన్ రెడ్డి,శివ,హరి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో టీడీపీ నాయకుల భాగస్వామ్యం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 72, 73, 74 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటి ఓటరు ధృవీకరణ కార్యక్రమం నిర్వహించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు పరిమళ, సునీత, చంద్రకళలతో కలిసి బూత్ స్థాయి ఏజెంట్లు షేక్ రఫిక్, ముక్తియార్, మల్లికార్జున పాల్గొని ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా, వివరాలు సక్రమంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు దుర్గా నవీన్, దుర్గా నాని, అంజి, ఐటీడీపీ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ఉండాలంటే అవగాహన ముఖ్యం

ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లా సైబర్ విభాగం సైబర్ సెల్ సి.ఐ పర్యవేక్షణలో కూడేరు మండలం బ్రహ్మణపల్లి క్యాంపులో అవగాహన కార్యక్రమం డిజిటల్ అరెస్ట్, సైబర్ మోసాలపై, కేడెట్లకు క్షుణ్ణంగా వివరించిన సైబర్ సెల్ సిబ్బంది సురక్ష డిజిటల్ వాహనం' ద్వారా ప్రత్యేక చైతన్యం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరికీ అవగాహన అత్యంత ముఖ్యమని అనంతపురం జిల్లా పోలీస్ సైబర్ విభాగం అధికారులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్ పర్యవేక్షణలో కూడేరు మండలం బ్రాహ్మణపల్లి ఎన్సీసీ, క్యాంపులో శనివారం ఎన్సీసీ కేడెట్లకు సైబర్ మోసాలపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ?ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సైబర్ విభాగం సిబ్బంది సురక్ష డిజిటల్ వాహనం ద్వారా కేడెట్లకు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ





రకాల సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా వివరించిన సైబర్ మోసాలు డిజిటల్ అరెస్టులు, కొరియర్ మోసాలు విదేశాల నుండి కొరియర్లలో డ్రగ్స్ వచ్చాయంటూ అక్రమంగా డిజిటల్ అరెస్టులు చేసే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక మోసాలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామనే ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, తక్కువ వడ్డీకే లోన్లు ఇస్తామనే ఫేక్ లోన్ యాప్స్, లాటరీల పేరుతో వచ్చే లింకులను నమ్మకూడదు. కార్డు, ఓటీపీ మోసాలు డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు, బ్యాంకు ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదు. బ్లాక్‌మెయిలింగ్, హనీట్రాప్ తెలియని నంబర్ల నుండి వచ్చే వీడియో కాల్స్ మాట్లాడితే, వాటిని స్క్రీన్ రికార్డ్ చేసి బ్లాక్‌మెయిలింగ్ చేసే ప్రమాదం ఉంది. చైల్డ్ పోర్నోగ్రఫీ సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్‌ను వీక్షించడం, షేర్ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నేరం జరిగితే ఏం చేయాలి 'గోల్డెన్ అవర్' ప్రాధాన్యత ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురై ఆర్థికంగా నష్టపోతే, వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సిబ్బంది తెలిపారు. సైబర్ నేరం జరిగిన మొదటి గంటను 'గోల్డెన్ అవర్' గా పరిగణిస్తారు. ఈ లోపు ఫిర్యాదు చేస్తే బాధితుల ఖాతాల నుండి పోయిన డబ్బును సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో ఫ్రీజ్ చేసి, తిరిగి రప్పించేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఫిర్యాదు చేసే సమయంలో దర్యాప్తు అధికారులకు సమర్పించాల్సిన లావాదేవీల స్క్రీన్‌షాట్లు, మెసేజ్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు వంటి ఆధారాలను ఎలా సేకరించాలో కేడెట్లకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అనంతపురం జిల్లా సైబర్ సెల్ సిబ్బంది రామాంజి, పుష్ప, మెర్సీ, ఎన్సీసీ కేడెట్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఆలిండియా పోస్టల్ చెస్ టోర్నమెంట్‌కు ఐదుగురు ఎంపిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని శ్రీ వాసవీ ధర్మశాల శనివారం చెస్ క్రీడాకారుల మేధోపోరుకు వేదికగా మారింది. హిందూపురం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోస్టల్ చెస్ సెలక్షన్స్-2026 ఉత్సాహ భరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోస్టల్ శాఖ ఉద్యోగులు పాల్గొని తమ వ్యూహాత్మక నైపుణ్యాలను ప్రదర్శించారు. ఆగస్టు నెలలో గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న ఆల్ ఇండియా పోస్టల్ చెస్ టోర్నమెంట్ లో ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌కు ప్రాతినిధ్యం వహించే జట్టును ఎంపిక చేయడానికి ఈ సెలక్షన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను ఇంటర్నేషనల్



ఆర్బిటర్ హుస్సేన్ ఖాన్, నేషనల్ ఆర్బిటర్ సాయి చరణ్ పర్యవేక్షణలో నిష్పక్షపాతంగా నిర్వహించారు. ప్రతి మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగగా, పాల్గొన్న క్రీడాకారులు తమ మేధస్సు, ఏకాగ్రత, వ్యూహాత్మక ఆలోచనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ నాగూర్ రెడ్డి భాష మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి చెస్ ఎంపికలను హిందూపురంలో నిర్వహించే అవకాశాన్ని కల్పించిన ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ శ్రీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోస్టల్ శాఖ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, మానసిక చురుకుదనాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పార్వతి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విమల్ కుమార్, పోస్టుమాస్టర్ మార్కండేయతో పాటు పలువురు పోస్టల్ శాఖ అధికారులు, ఉద్యోగులు, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను అధికారులు అభినందిస్తూ జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఎరువుల కోసం రైతు పోరాటం..!

- యాప్ చెబితేనే బస్తా... లేకపోతే నిరాశే..!
- ఆర్ఎస్‌కేల్లో నిల్వలు శూన్యం
- ప్రైవేట్ దుకాణాల దోపిడీకి రైతులు బలి
- కౌలు రైతులు, ఈనాం భూముల సాగుదారులకు ఎరువులు అందని ద్రాక్ష

ప్రజాభూమి, హిందూపురం టౌన్

వానలు కురిసి ఖరీఫ్ సాగు జోరందుకుంటున్న వేళ ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగం మరోసారి ఎరువుల కష్టాల్లో చిక్కుకుంది. పొలంలో విత్తనం వేయడానికి సిద్ధమైన రైతు ఇప్పుడు ఎరువు బస్తా కోసం దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేతిలో డబ్బు ఉన్నా ఎరువు దొరకని దుస్థితి నెలకొంది. యాప్ అనుమతిస్తేనే బస్తా.. లేదంటే నిరాశతో వెనుదిరగాల్సిందే. ఒకప్పుడు అవసరమైనన్ని బస్తాలు కొనుగోలు చేసిన రైతులు ఇప్పుడు యాప్ కేటాయించిన ఒకటి, రెండు బస్తాల కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడుతున్నారు. యాప్‌దే రాజ్యం... రైతు అవసరాలకు విలువ లేదా..,,! ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎరువుల పంపిణీ విధానంలో యాప్‌దే తుది నిర్ణయం. రైతు ఆధార్ నంబర్ నమోదు చేసిన వెంటనే వెబ్‌ల్యాండ్ వివరాలు, గత ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు, భూమి విస్తీర్ణం వంటి సమాచారం తెరపై కనిపిస్తుంది. వాటి ఆధారంగానే రైతుకు ఎంత ఎరువు ఇవ్వాలో యాప్ నిర్ణయిస్తోంది . రైతు ప్రస్తుతం ఏ పంట సాగు చేస్తున్నాడన్నది పక్కనపెట్టి గత ఏడాది నమోదైన పంటల ఆధారంగా కోటా కేటాయిస్తుండటంతో అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకేసారి మొత్తం కోటా ఇవ్వకుండా రెండు, మూడు విడతలుగా విభజించి చూపుతుండటంతో రైతులకు అవసరమైన సమయంలో అవసరమైన ఎరువులు అందడం లేదు.



### ఉదయం పనిచేసే యాప్... మధ్యాహ్నానికి మూగబోయే సర్వర్

ఎరువులు కొనాలంటే రైతు ముందుగా యాప్‌లో నమోదు కావాలి. డీలర్‌ను ఎంపిక చేసుకోవాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఎరువు బస్తా చేతికి వస్తుంది. అయితే ఉదయం 10 గంటల వరకు కొంతమేర పనిచేసే యాప్, ఆ తర్వాత సర్వర్ డౌన్ కావడం సాధారణంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి నిరీక్షించినా నమోదు పూర్తికాకపోవడంతో చాలామంది నిరాశగా వెనుదిరుగుతున్నారు.

### 859 ఆర్ఎస్‌కేలు... ఎరువులు ఎక్కడ...,,!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 859 రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కేలు) ఉన్నప్పటికీ చాలా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు కనిపించడం లేదు. కేవలం 30 శాతం కేంద్రాలే కొంత మేర నిల్వలు ఉంచుకోగా, సుమారు 50 శాతం కేంద్రాలకు గోదాములే లేకపోవడంతో ఎరువులు నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా రైతులు ఆర్ఎస్‌కేలకు వెళ్లి నిరాశ చెందుతూ ప్రైవేట్ దుకాణాల బాట పడుతున్నారు. యూరియా, డీఏపీ మాత్రమే... కాంప్లెక్స్ ఎరువులు మాయం ప్రస్తుతం ఆర్ఎస్‌కేల్లో యూరియా, డీఏపీ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మొక్కల పెరుగుదలకు కీలకమైన కాంప్లెక్స్ ఎరువులు కనిపించడం లేదు. దీంతో రైతులు ప్రైవేట్ డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. డిమాండ్‌ను అవకాశంగా మార్చుకున్న కొందరు వ్యాపారులు పాతభ నిల్వలను కొత్త ధరలతో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

### కౌలు రైతులకు కార్డులే లేవు... ఎరువులు ఎలా వస్తాయి...,!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 60 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసినా, ఇప్పటికీ వేలాది మందికి కార్డులు అందలేదు. కార్డులు ఉన్న రైతులకు కూడా ఎరువులు సకాలంలో అందకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పొలం దున్నేది కౌలు రైతే అయినా, ప్రభుత్వ వ్యవస్థలో మాత్రం అతని పేరు కనిపించకపోవడం వల్ల ఎరువుల పంపిణీలో తీవ్ర వివక్ష ఎదురవుతోంది.

రెండు లక్షల మంది రైతులకు మూసుకుపోయిన ద్వారం వెబ్‌ల్యాండ్‌లో భూమి వివరాలు లేని రైతులు, ఇనాం భూముల సాగుదారులు, దేవాదాయ భూముల కౌలు రైతులు, ఫ్రీహోల్డ్ భూముల్లో సాగు చేస్తున్నవారు కలిపి ఉమ్మడి జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది ఉన్నట్లు అంచనా. యాప్‌లో వీరి పేర్లు కనిపించకపోవడంతో ఎరువులు కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోయింది. వ్యవసాయం చేస్తున్నా అధికారికంగా రైతులుగా గుర్తింపు లేకపోవడం వల్ల వీరి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

### ఎరువుల కోసం రైతు... రైతు కోసం వ్యవస్థ ఎక్కడ...

ఖరీఫ్ సీజన్‌లో రైతుకు అత్యవసరంగా అవసరమయ్యేది విత్తనం, ఎరువు, నీరు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతు ఇప్పుడు ఎరువుల కోసం యాప్ ముందు చేతులు జోడించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాంకేతిక లోపాలు, నిల్వల కొరత, కౌలు రైతుల నిర్లక్ష్యం, వెబ్‌ల్యాండ్ సమస్యలు కలిసి రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. పొలంలో పంట వేయాలంటే ముందుగా యాప్ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి రావడం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న దుర్భర వాస్తవానికి నిదర్శనం అని రైతు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎరువుల పంపిణీలో రైతుల ఇబ్బందులు తొలగించాలి -ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరి



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులోఉంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరి డిమాండ్ చేశారు. యాప్ ఆధారిత పంపిణీ విధానం, సర్వర్ సమస్యల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఏడాది పంట నమోదు ఆధారంగా కాకుండా ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలను పరిగణనలోకి తీసుకుని ఎరువులు ఇవ్వాలని కోరారు. ఆర్ఎస్‌కేల్లో తగినంత యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను నిల్వ ఉంచడంతో పాటు కౌలు రైతులు, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు లేని రైతులకు కూడా ఎరువులు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.


## 15 నుండి ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - కలెక్టర్ వీ. అభిషిక్త్ కిషోర్

ప్రజాభూమి, విశాఖపట్నం జిల్లా,

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జూన్ 15 నుండి ప్రారంభ మవుతుందని ,ఈనెల 15 నుండి వచ్చే నెల 14 వరకు బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల ఎన్యుమరేషన్ (గణన )చేస్తారని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. ఈ ఏడాది మే నెల 25 వరకు ఓటర్లుగా నమోదైన ఓటర్లందరికి ఫారం ఇన్ డూప్లికేట్ బిఎల్వోలు ఇంటింటికి తిరిగి పంపిణీ చేస్తారన్నారు. బిఎల్ఓ ఓటర్లకు ఫారం ఎలా నింపాలో వివరించి ఆ నింపిన ఫారం ను తిరిగి వారి నుండి సేకరిస్తారన్నారు .ఇచ్చిన రెండు ఫారాల్లో ఒకటి దీూా తీసుకుని రెండోది ఓటర్ కు రశీదు గా తిరిగి ఇస్తారని తెలిపారు.బి ఎల్ ఓ ఇంటికి వచ్చినప్పుడు ఇంటికి తాళం వేసి (డోర్ లాక్) ఉంటే ఎన్యుమరేషన్ ఫారం ను ఇంటిలో ఉంచుతారు. మూడుసార్లు వరకు ఆ గృహాన్ని సందర్శించి వారి నుండి నింపిన ఫారం సేకరిస్తారని, ఎన్యూమరేషన్ ఫారం ను ఆన్లైన్లో డౌన్లోడ్ చేసుకుని నింపి తిరిగి అప్లోడ్ చేసి ఆ ఫారం ను దీూా కు అందజేయు టకు కూడా అవకాశం కలదని పేర్కొన్నారు.బిఎల్వోలు సేకరించిన ఫారంలను ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ కోసం ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి అందజేస్తారన్నారు. ఓటర్లు నింపిన ఎన్యుమరేషన్ ఫారం లను బిఎల్వోలకు తప్పని సరిగా అందజేయాలని,ఓటర్లు సంతకం తో తిరిగి దీూా నకు అందజేయకపోతే జూలై 21న ప్రచురించే డ్రాఫ్ట్ ఎలెక్టోరల్ రోల్ లో ఓటర్ గా నమోదు కారని తెలిపారు .జూలై 14న పోలింగ్ స్టేషన్ల రేషలైజేషన్ (హేతుబద్ధీకరణ) జరుగుతుందని,జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు 2002 ఓటరు జాబితా తో మ్యాప్ కానీ లేదా మ్యాప్ అయ్యి వివరాల్లో వ్యత్యాసం ఉన్న ఓటర్లకు నోటీసు లు జారీ చేసి వారి నుండి సంబంధిత సమాచారం తో తదుపరి నిర్ణయం తీసుకొంటారు.జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ చేసు కోవచ్చని ఎవరైనా ఓటరు జులై 14 లోపు పూర్తి చేసి సంతకం చేసిన ఎన్యూమరేషన్ ఫోరం సమర్పించ లేక పోయిన వారు తిరిగి ఫోరం 6 ద్వారా పేరు నమోదుకు జులై 21 నుండి ఆగస్టు 20 దాకా సమయం వున్నదని. జూలై 21 నుండి సెప్టెంబర్ 18 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పరిష్కరిస్తారని , సెప్టెంబర్ 22 న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు. ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బిఎల్ఎ లను నియమించమని సూచించామని ,సర్ కార్యక్రమానికి సహకరించాలని కోరామని చెప్పారు .ఏఈఆర్వోలతో సమావేశం నిర్వహించి సమర్థవంతంగా సర్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. బిఎల్వోలు ఇంటికి వచ్చిన సమయంలో పూర్తి వివరాలతో నింపిన న్యూమరేషన్ ఫారాలను అందజేసి తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉండే విధంగా చూచుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950 కు కాల్ చేయవచ్చని , ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో లేదా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. ఓటర్ల జాబితా నాణ్యత పై రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తుండడంతో సర్ కార్యక్రమం నిర్వహిస్తున్నదన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం..!

- హౌసింగ్ పథకంలో అక్రమాలపై విచారణ -మంత్రి కొలుసు పార్థసారథి
- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి.. బొల్లవరం హౌసింగ్ లేఅవుట్ పరిశీలన,
- లబ్దిదారులతో ముఖాముఖి




ప్రజాభూమి ప్రతినిధి,ప్రొద్దుటూరు: పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకం అమలులో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గురువారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం హౌసింగ్ లేఅవుట్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డితో కలిసి సందర్శించిన మంత్రి అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "పేదలకు సొంత ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు.. వారి జీవితానికి భద్రత, గౌరవం అన్నారు. ప్రొద్దుటూరులో ఒక్క అర్హుడూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే మా సంకల్పం" అన్నారు. గతంలో హౌసింగ్ పథకం అమలులో అనేక అవకతవకలు జరిగాయని, లబ్ధిదారుల ఎంపిక, ప్లాట్ల కేటాయింపు, గృహ నిర్మాణాల నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా మెప్మా మహిళా సంఘాలకు సంబంధించిన నిధుల వినియోగంలో సుమారు రూ.48 కోట్ల మేర గోల్‌మాల్ జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పేదల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. "పేదల కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సరైన లబ్ధిదారునికే చేరాలి. గతంలో ఎక్కడైనా అన్యాయం జరిగి ఉంటే దాన్ని సరిదిద్దడం మా బాధ్యత. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో హౌసింగ్ కార్యక్రమం పురోగతిని వివరిస్తూ, రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్లలో మొత్తం 4,82,481 సెంట్ల విస్తీర్ణంలో 23,068 ప్లాట్లు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 19,924 ప్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా, మిగిలిన 3,144 ప్లాట్లను కూడా త్వరలో అర్హులైన పేదలకు అందజేస్తామని చెప్పారు. అలాగే నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,043 ఇళ్లకు అనుమతులు మంజూరు చేశామని, అందులో పట్టణ ప్రాంతాల్లో 11,655 ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3,388 ఇళ్లు ఉన్నాయని వెల్లడించారు. రామేశ్వరం లేఅవుట్‌లో 7,647 ప్లాట్లలో 6,712, బొల్లవరం లేఅవుట్‌లో 10,462 ప్లాట్లలో 9,373, మీనాపురం లేఅవుట్‌లో 4,959 ప్లాట్లలో 3,839 ప్లాట్లు ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. బొల్లవరం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్న మంత్రి, ఇప్పటివరకు సుమారు 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో 4 లక్షల ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలు అందజేస్తామని వెల్లడించారు. "ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు సొంత ఇల్లు అత్యంత అవసరం. పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. ఇంటి స్థలం నుంచి గృహ నిర్మాణం వరకు అన్ని దశల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని గృహరహిత కుటుంబాలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ... ప్రొద్దుటూరులో ఒక్క అర్హుడూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే మా సంకల్పం" అన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో హౌసింగ్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి మంత్రి పార్థసారథి ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకం అమలులో అనేక లోపాలు, అక్రమాలు చోటుచేసుకోవడంతో వేలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించకపోవడం, నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడం, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని చెప్పారు. బొల్లవరం హౌసింగ్ లేఅవుట్‌లో అనేక ఇళ్లు అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన గృహ నిర్మాణాలను తిరిగి గాడిలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణాలు పూర్తిచేసే లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. హౌసింగ్ పథకానికి సంబంధించిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మెప్మా మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, విచారణలో వాస్తవాలు బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలు

## - సేవా కార్యక్రమాలతో పేదలకు అండగా నిలిచిన మేడా మధు సూధన రెడ్డి



ప్రజాభూమి, సిద్ధవటం: రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం సిద్ధవటం మండలంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. భాకరాపేట సర్కిల్‌లో ఆయన సోదరుడు, ఎంఆర్‌కేఆర్ మేడా కన్‌స్ట్రక్షన్స్ ఎండీ మేడా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మేడా రఘునాథరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాధవరం--1 గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద కుటుంబాలైన బత్తల మోహన్‌కృష్ణ, మామిళ్ల బాల కుటుంబాలను మేడా మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కొత్తమాధవరం గ్రామానికి చెందిన గుంటి ప్రసాద్ కుమారుడు జై కైలాష్ (10), బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ మేడా రఘునాథరెడ్డి ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా మేడా మధుసూదన్‌రెడ్డి కూడా సామాజిక బాధ్యతతో నిరుపేదలకు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం మేడా కుటుంబ ప్రత్యేకత అని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం పట్ల మేడా సోదరులు చూపుతున్న చొరవ యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరీరెడ్డి, మండల అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ దేరంగుల శివయ్య, మాజీ సర్పంచ్ కేవీ సుబ్బయ్య, వావిళ్ల శ్రీనివాసులురెడ్డి, అరవ నారాయణరెడ్డి, మాధవరం-2 గ్రామ వైసీపీ అధ్యక్షుడు శ్రీరాందాసు వెంకట్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి

- ర్యాలీ విజయవంతం కావడంతో ఓర్వలేక ఇష్టం వచ్చి మాట్లాడుతున్న టిడిపి నాయకులు
- నోటిని అదుపులో ఉంచుకొని మాట్లాడాలన్న వైకాపా నాయకులు



ప్రజాభూమి, పులివెందుల పట్టణంలోని మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ మునిసిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్ ల, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కోడి రమణ లు మాట్లాడుతూ నిన్నటి ర్యాలీ భారీగా విజయవంతం కావడంతో టీడీపీ నాయకులు దిక్కుతోచక లేనిపోని ఆరోపణలు చేస్తూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు అని అన్నారు. రిమోట్ ఏరియా గా ఉన్న పులివెందుల ప్రాంతాన్ని ప్రజల అండతో అన్ని విధాలా అభివృద్ధి చేసిన కుటుంబం వైయస్ కుటుంబం అయితే అధికార మదం తో అక్రమాలతో పులివెందులకు , ప్రజలకు కన్నం వేస్తున్న ఘనత టీడీపీ నాయకులది.కిరికిరి భాషా గుర్తు పెట్టుకో,మా నాయకుడు ఎంపీ అవినాష్ రెడ్డి నిజాయితీ పరుడు గొప్ప వారు కాబట్టే మీరు చేస్తున్న అన్ని ఆరోపణలపై ప్రమాణానికి సిద్ధం అని సవాలు విసరడం జరిగింది. దానికి ఇంతవరకు కనీసం మీ నాయకుల నుంచి సమాధానమే రాలేదు అని అన్నారు.మెడికల్ కాలేజీ నిర్మాణ నిబంధనల ప్రకారం ఉపయోగించాల్సిన కంకర స్టేజి 3 క్రషర్ ప్లాంట్ అయ్యి ఉండి వైట్ గ్రానైట్ మెటల్ లో క్యూబికల్ ఆకారం లో ఉండాలనే నిబంధన ఉండటం వలనే ఇంజినీర్ల సలహా మేరకే మన జిల్లాలో చక్రాయపేట మండలం లో ఉన్న ఒకే ఒక్క స్టేజి 3 వైట్ మెటల్ క్రషర్ నుంచి తీసుకోవడం జరిగింది, వాస్తవం తెలుసుకోకుండా ఏమాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా ఆరోపణలు చేయడం టీడీపీ నాయకులు మానుకోవాలిఅని అన్నారు. కిరి కిరి భాషా నువ్వు మీ నాయకులు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే చక్రాయపేట లో దాడులకు దిగడం, మీ పార్టీ లో ఉండేవారు కిడ్నాప్ లు, అక్రమాలు చేయడం వాస్తవం కాదా,నిజంగా మేము ఆరోజు మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలనుకుంటే మీ పరిస్థితి ఏంటో గుర్తు చేసుకోవాలని ఈ రోజు మీరు చేస్తున్న , మాట్లాడు తున్న ప్రతి పదానికి సమాధానం చెప్పుకోవాల్సిన రోజులు వస్తాయని అవన్నీ గుర్తు పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు విశ్వనాథ రెడ్డి కి నాకు అంత సాన్నిహిత్యం లేదు, వాళ్ళింటికి నేను పోలేదు, నా ఇంటికి అతను రాలేదు....విశ్వనాథ్ నువ్వేమీ ఆర్చేవాడివా, తీర్చేవాడివా, నీ స్థాయి ఏంటి వైఎస్ కుటుంబం దగ్గరగా ఉండేవాడివి కాబట్టి అందరికీ తెలిసివుండచ్చు అంతే కానీ నువ్వే పెద్ద నాయకుడివి అని నేను నీ దగ్గర కన్నీలు పెట్టుకున్నానా అని వరప్రసాద్ ఘాటుగా సమాధానం ఇచ్చారు.మూడు పార్టీ లు కలిసి ర్యాలీ చేస్తే 600 మంది వస్తే అది చూసి మేము జడుసుకోవడం కాదు నిన్న జరిగిన ర్యాలీలో దాదాపు 8000 మంది పాల్గొనడం జరిగింది, దానిని మీరు జీర్ణించుకోలేక అడ్డం వచ్చిన మాటలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని వారు అన్నారు.మున్సిపాలిటీ లో అధికారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికీ అనేక సమస్యలు ప్రజలను పీడిస్తున్నాయని, మా ఎంపీ సొంత నిధులతో, ఎంపీ ఫండ్స్ తో ఇంకా అభివృద్ధి పనులు చేస్తున్నారని, చేతనైతే అసంపూ ర్తిగా ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని, మా హయాం లో మున్సిపాలిటీ కి రెండు సార్లు అవార్డు లు రావడం జరిగింది అని, ఇప్పుడు మున్సిపాలిటీ దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు కోడి రమణ మాట్లాడుతూ మహబూబ్ భాషా నువ్వు ఇసుక గురించి ఏమి తెలుసునని మాట్లాడుతున్నావ్, నేను ఇసుక రీచ్ లో ఒక్క బండి అయినా రూల్స్ కి వ్యతిరేకంగా తెచ్చుకున్నట్లు కాణిపాకం వచ్చి ప్రమాణం చేయగ లవా అని అన్నారు.మీరు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీల్లో ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి తో పాటు ఇచ్చిన ప్రతి హామీ సంపూర్తిగా అమలు చేసేంతవరకు ప్రజల పక్షాన డిమాండ్ చేస్తూనే ఉంటాం. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రశ్నిస్తే ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మంచి పద్ధతి కాదని వైకాపా నాయకులు హితవు పలికారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం మండలంలోని తాటి మాకుల కండ్రిక సమీపంలోని గుండోడు కణం రోడ్డు పై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీవీ సపార్లు గ్రామానికి చెందిన బి అనిల్ కుమార్ (31) మృతి చెందాడు. స్థానిక పోలీసుల వివరాలు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి అనిల్ కుమార్ శుక్రవారం రాత్రి 9.00 గంటల సమయంలో తన సొంత పనులు ముగించుకొని తిరుపతి వైపు నుంచి గుండోడు కణం రోడ్డు మార్గం ద్వారా హీరో హోండా మోటార్ సైకిల్ లో స్వగ్రామమైన టీవీ సఫార్లకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా తాటితోపు కండ్రిగ గ్రామం సమీపమున, భాస్కర్ నాయుడు మామిడి తోపు సమీపంలో తాటితోపు కండ్రిగ గ్రామానికి చెందిన కోటకొండ నరసింహులు, అతని స్నేహితుడు వేముల వెంకటేష్ లు రోడ్డు కెఏ 50 ఈ ఏ 5339 రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ ను రోడ్డుపైఅడ్డంగా పెట్టి మద్యం తాగుతుండగా, బి అనిల్ కుమార్ ద్విచక్ర వాహనాన్ని, మద్యం సేవిస్తున్న వ్యక్తులను తప్పించబోయే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అనిల్ కుమార్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో తలకు తీవ్ర రక్త గాయమై, రోడ్డుమీద తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందినాడు. ఈ విషయమై మృతుడు బి. అనిల్ కుమార్ అన్న బి మనోహర్ ఇచ్చిన పిర్యాదు మేరకు రామచంద్రాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎమ్. భక్తవత్సలం సంఘటన స్థలాన్ని పరిశీలించి, రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాన్ని పెట్టి ప్రమాదానికి, అనిల్ కుమార్ మృతికి కారకులైన కోటకొండ నరసింహులు, వేముల వెంకటేష్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనిల్ కుమార్ మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.



# శనిత్రయోదశి సందర్భంగా శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిపై భాకరాపేట సమీపంలోని మందగిరి శనేశ్వర ఆలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శనేశ్వరునికి తైలాభిషేకం సహా విశేష ఆరాధనలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శర్మ తెలిపారు. శని దోషాలు ఉన్న భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఓటర్ జాబితాలో అర్హులకే చోటు కల్పించాలి : సబ్ కలెక్టర్ భావన



ప్రజాభూమి, సిద్ధవటం: ఓటర్ జాబితాలో అర్హులైన స్థానికులకు మాత్రమే చోటు కల్పించాలని, అనర్హులు మరియు ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లను తొలగించాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని మాధవరం-1, పార్వతీపురం గ్రామాల్లో ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించే సర్వేలో ప్రతి ఓటరును క్షుణ్ణంగా గుర్తించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. సిద్ధవటం మండలంలో ఓటర్ జాబితా పరిశీలనను 99 శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఓటరును గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ చేపడతామని, అర్హులైన వారికి మాత్రమే ఓటరు జాబితాలో నమోదు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఏలు, బీఎల్‌వోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు రెచ్చిపోతే కఠిన చర్యలు

## -రౌడీ షీటర్లను హెచ్చరించిన సిఐ వెంకటేశ్వర్లు



ప్రజాభూమి, సిద్ధవటం: రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట, సిద్ధవటం, నందలూరు మండలాల పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. భూ ఆక్రమణలు, బెదిరింపులు, గూండాగిరి, గొడవలు సృష్టించి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే సహించబోమన్నారు. గ్రామాల్లో ఎవరైనా రౌడీయిజానికి పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హారికతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఆర్‌తో మహిళకు ప్రాణం పోసిన వైద్యుడు

## - యువతిని కాపాడిన డాక్టర్ లక్ష్మి నారాయణ




ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో హైవే రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోయిన యువతికి సకాలంలో సీపీఆర్ నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సువర్ణ (19) ఇంటికి వెళ్తుండగా ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలింది. సమాచారం అందుకున్న శాంతి హెల్త్ కేర్ వైద్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ వెంటనే అక్కడికి చేరుకుని సీపీఆర్ నిర్వహించడంతో ఆమెకు మళ్లీ శ్వాస అందింది. అనంతరం



మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. బలహీనత నివారణకు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగాలని సూచించారు. మహిళ ప్రాణాలను కాపాడిన డాక్టర్ లక్ష్మీనారాయణకు సువర్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు -సిఐ ప్రసాదరావు



ప్రజాభూమి, పులివెందుల పులివెందుల రూరల్ మున్సిపాలిటీ పరిధిలోట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సిఐ ప్రసాద్ రావు అన్నారు. సందర్భంగా ఆయన శనివారం పాత ఆర్టిసి బస్టాండ్ సర్కిల్, పార్నపల్లి రోడ్డు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వాహనాలు రోడ్ల్లు,ఫుట్ పాత్ పై ఉంచితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి వాహనాదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. గంటల తరబడి దుకాణాల ముందు పార్కింగ్ చేసి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

ఆదివారం 14 జూన్ 2026

# శ్రీ శనీశ్వర స్వామి వారికి ప్రత్యేక తైలాభిషేకం



ప్రజాభూమిప్రతినిధి:శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న శ్రీ శనేశ్వర స్వామి వారికి శనివారం సందర్భంగా ప్రత్యేక తైలాభిషేకం, హారతులు, విశేష అలంకారం, ధూపదీప నైవేద్య కార్యక్రమాలను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల శ్రేయస్సు, లోకక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ అధికారులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీవాయు లింగేశ్వర సేవలో మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి కుటుంబం



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వాయు లింగేశ్వర స్వామి దర్శనానికి బి.ఆర్. గవాయి , మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి (ఫార్మర్ చీఫ్ జస్టిస్ అఫ్ ఇండియా ), శ్రీకాళహస్తీశ్వర స్వామి



వారి దర్శనార్థం శ్రీకాళహస్తికి విచ్చేసి శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి దర్శన ఏర్పాట్లు కల్పించి, ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ బీకే వెంకటేశులు , నరసింహ మూర్తి (జడ్జి), ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి , ప్రోటోకాల్ ఏ ఈ ఓ లోకేష్ బాబు , ఏపీ పి ఆర్ ఓ రవి , కోర్టు పర్యవేక్షకులు రవి , ఆలయ పర్యవేక్షకులు సి . నాగభూషణం యాదవ్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జే.వి.వి.లో సభ్యులుగా చేరండి. గోడ పత్రికలు ఆవిష్కరణ



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సి.వి.సి పార్క్ నందు జే.వి.వి లో సభ్యులుగా చేరండి అను గోడ పత్రికలను జీ. ప్రతినిధులు ఆవిష్కరించారు. జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలనుండి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం , మూఢ నమ్మకాల నిర్మూలన కోసం పనిచేస్తుందని ప్లాస్టిక్ ను నిషేధించాలని మరియు విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యార్థులు జే.వి.వి లో భాగస్వాములు కావాలని మంచి సమాజం కోసం అందరం కష్టపడదామని కోరారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్, శ్రీనివాసాచారి, సురేష్, పసల వెంకటేశ్వర్లు, మనోభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో శనివారం భక్తిశ్రద్ధలతో కొనసాగిన దువ్వూరు జనార్ధన్ రెడ్డి పాదయాత్ర



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

శ్రీ వెంకటేశ్వర స్వామిపై అపార భక్తితో, టిడిపి యువ నాయకుడు మరియు స్వామి భక్తుడు దువ్వూరు జనార్ధన్ రెడ్డి చేపట్టిన మహాసంకల్ప పాదయాత్ర భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతోంది. తాను నివాస ముంటున్న విద్యానగర్ నుండి కల్లూరు కొత్తపాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు గత నాలుగు శనివారాలుగా నిరంతరంగా పాదయాత్ర నిర్వహిస్తూ భక్తులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈరోజు కూడా ఉదయం వేళ భక్తి భావంతో మహాసంకల్ప పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రలో ఆయనతో పాటు శ్రేయోభిలాషులు, స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణల మధ్య ముందుకు సాగారు. మార్గమంతా భక్తి వాతావరణం నెలకొనగా, భక్తులు స్వామి ఆశీస్సులు కోరుతూ పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర అనంతరం కల్లూరు కొత్తపాలెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తి, సేవాభావం, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకగా కొనసాగుతున్న ఈ మహాసంకల్ప పాదయాత్ర స్థానిక భక్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది

# లైసెన్స్ లేని టూ వీలర్ త్రీ వీలర్ లకు చలానా విధిస్తున్న టౌన్ సిఐ శేఖర్ బాబు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,




గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ టౌన్ సీఐ శేఖర్ బాబు ఆధ్వర్యంలో ఈరోజు టూ వీలర్ ,త్రీ వీలర్ డ్రైవ్ నిర్వహించినారు టౌన్ సిఐ మాట్లాడుతూ పట్నంలోని టూ వీలర్ త్రీ వీలర్ లైసెన్స్ లేకుండా తిరుగుతూ మద్యం సేవించి వాహనాల నడుపుతూ చిన్న పిల్లలుకు బైక్ లు ఇచ్చి రోడ్డు ల మీదకు పంపడం సరికాదు అని అధికలోడుల లతో ఆటోలో ఎక్కించడం వలన ప్రమాదాలకు గురికావడం జరుగుతుంది కావున ఇటువంటివి జరగకుండా ఉండేందుకు ఈ డ్రైవ్ నిర్వహించడం జరిగింది వీరి వెంట వన్ టౌన్ ఎస్ ఐ మనోజ్ కుమార్ మరియు సిబ్బంది ఉన్నారు.

# సమాజ ఆరోగ్యమే లక్ష్యం.. తిరుపతిలో ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం

### -వైద్య సేవలతో పాటు డా. ఎ.ఆర్. రెడ్డికి సన్మాన సభ



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

సమాజ ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు సేవలను అందిస్తూ ప్రజలలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి శాఖ మరియు ప్రకాశం పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రకాశం పార్క్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు ఉచితంగా సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక వైద్య సలహాలు అందించడంతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆరోగ్య రికార్డుల నిర్వహణకు ఉపయోగపడే హెల్త్ కార్డులను కూడా పంపిణీ చేయనున్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని, సేవా దృక్పథంతో పనిచేస్తున్న వైద్యులు సమాజానికి మార్గదర్శకులని నిర్వాహకులు తెలిపారు. వైద్య సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజల ఆరోగ్య సాధనకు ఉపయోగపడే ప్రకాశం పార్క్‌లో వ్యాయామం, నడక చేసే వారికి మరింత సౌకర్యం కల్పించే ఉద్దేశంతో పార్క్‌కు సౌండ్ సిస్టమ్‌ను విరాళంగా అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య నిర్వాహకులుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి అధ్యక్షులు డా. ఎ.ఆర్. రెడ్డి, ట్రెజరర్ డా.రెడ్డెప్ప, ప్రకాశం పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపినాథ్ వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక అతిథిగా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ హాజరుకానున్నారు. అదేవిధంగా వైద్య వృత్తిలో విశిష్ట సేవలందిస్తూ, సమాజ సేవలోనూ తనదైన ముద్ర వేసిన ప్రముఖ వైద్యుడు డా. ఎ.ఆర్. రెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించనున్నారు. ఆయన అందిస్తున్న వైద్య సేవలు, సామాజిక కార్యక్రమాలు యువ వైద్యులకు స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు పేర్కొన్నారు.

స్థలం: ప్రకాశం పార్క్, తిరుపతి ఉదయం 6:30 గంటలకు ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం - పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తిరుపతి జిల్లా నుంచి నన్ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ నియామకం నాకు గౌరవంతో పాటు మరింత బాధ్యతను కూడా కల్పించింది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడం, పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేయడం నా ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, తిరుపతి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపి ఆచారికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలు, నన్ను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించిన స్నేహితులు, శ్రేయోభిలాషులు, ఓబీసీ మోర్చా కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పార్టీ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో చురుకైన పాత్ర పోషిస్తాను. తిరుపతి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత, వెనుకబడిన వర్గాలను పార్టీతో అనుసంధానం చేసే దిశగా కృషి చేస్తాను. పార్టీ ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ, ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరియు పార్టీ విజయానికి నా వంతు సేవలను అందిస్తానని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను.

# ఓటర సవరణ పై ప్రత్యేక దృష్టి - అధికారులతో సమావేశం

## జనసేన నాయకులు దండి నరేంద్ర



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారి భాను ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి , తహసీల్దార్ మరియు ఎన్నికల శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 168-శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సార్ ) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా నకిలీ, మరియు



అనర్హ ఓట్లను గుర్తించి తొలగించడం, అర్హులైన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అలాగే బి ఎల్ ఓ లు, బిఎల్ఏ లు, రాజకీయ పార్టీలు మరియు ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడం గురించి స్పష్టత ఇచ్చారు. సమావేశంలో జనసేన పార్టీ తరఫున పలు కీలక అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు, ధృవీకరణ ప్రక్రియలు మరియు పారదర్శకతకు సంబంధించిన పలు ప్రశ్నలను లేవనెత్తాము. వాటిపై ఆర్డీవో, సంబంధిత అధికారులు సంతృప్తికరమైన వివరణలు అందించడంతో సమావేశం ఎంతో నిర్మాణాత్మకంగా, ఫలప్రదంగా సాగింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితాల స్వచ్ఛతే పునాది. ఈ లక్ష్య సాధనలో ఎన్నికల యంత్రాంగం, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాము. ఎన్నికల ప్రక్రియను మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా మార్చే ప్రతి కార్యక్రమానికి జనసేన పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని నరేంద్ర దండి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు రిటైర్డ్ ఎమ్మార్వో చంద్రశేఖర్ రావు, వెంకటేష్ రాయల్, నవీన్, పవన్ సాయి, ధన, చంద్ర, సతీష్, దిలీప్, సుబ్బు, శ్రీను, మునికుమార్, దినేష్ , చందు, ఉదయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )-2026పై అధికారుల అవగాహన సమావేశం

### ఓటరు జాబితా సవరణలో ప్రజలు సహకరించాలి : తహసీల్దార్ పిలుపు



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ మరియు సహాయ ఓటరు నమోదు అధికారి ప్రజలకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు, బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ వోలు) ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (సర్ )-2026 కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు పేర్లు సరైన విధంగా నమోదు అయ్యేలా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 15, 2026 నుంచి జూలై 14, 2026 వరకు బిఎల్వో లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారం అందజేసి, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా, అర్హత వంటి అంశాలను పరిశీలించనున్నారు. అలాగే, జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ, అనంతరం పరిశీలన చేసి సెప్టెంబర్ నెలలో తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరుగా నమోదు కావాలని, మరణించిన వారు లేదా వేరే ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపుకు అవసరమైన సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజలు పూర్తి సహకారం అందించి ఓటరు జాబితాను తప్పులులేని విధంగా రూపొందించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులకు దిశానిర్దేశం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంటలో ఓటర్ జాబితా, సవరణపై ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సర్వే,ఓటరు జాబితా సవరణ (ఎస్,ఐ,ఆర్) మరియు మ్యాపింగ్ ప్రక్రియపై శనివారం రేణిగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తాసిల్దార్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులు (బీ,ఎల్,ఓలు) లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, అందులో ప్రతి అర్హుడి పేరు తప్పనిసరిగా నమోదు కావాలని, అనర్హుల పేర్లు తొలగించబడేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని, ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని (బీ,ఎల్,ఓ)లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడం, చిరునామా మార్పులు, పేరు సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఒక్కరూ ఓటు హక్కును, వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఇంటింటి సర్వే సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించడం, ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిన (ఈ,సి,నెట్) మరియు ఇతర డిజిటల్ యాప్‌ల వినియోగంపై( బీ,ఎల్,ఓ)లకు ప్రాయోగిక అవగాహన కల్పించారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా తప్పులులేని, పారదర్శక ఓటరు జాబితా సిద్ధం చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. మ్యాపింగ్ ప్రక్రియలో ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలోని ఓటర్ల వివరాలు ఖచ్చితంగా సరిపోలేలా చూడాలని, భౌగోళిక పరిధి మార్పులు ఉంటే వెంటనే నమోదు చేయాలని ,ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగానికి చెందిన సిబ్బంది, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో రైతులను దోచుకుంటున్న రైస్ మిల్ యజమాని



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

రైతులు వడ్లను బియ్యంగా మార్చుకునేందుకు రైస్ మిల్ వద్దకు వెళ్తారు ఇదే అదునుగా దోచుకుంటున్న రాయల్ పురం వద్ద ఉన్న రైస్ మిల్ యజమాని ( దేవ) . రైతులు బియ్యం తక్కువగా ఇచ్చారని అడిగినప్పుడు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న రైస్ మిల్ యజమాని దేవా. ఇప్పటికే యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులు. పగలనక రాత్రనక మూడు నెలల కష్టపడి పండించిన పంటను దళారులు ఒకవైపు, రైస్ మిల్ యజమానులు ఒక వైపు దోచుకుంటున్న పరిస్థితి. రైతు వద్ద రాబందులాగా దోచుకుంటున్న రైస్ మిల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు.

## ట్రిపుల్ఐటీకి ధరణి ఎంపిక

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం:



మండలంలోని కేకేవీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ ధరణి ట్రిపుల్ఐటీ కి ఎంపికైనట్లు ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు పేర్కొన్నారు. శనివారం రామచంద్రాపురం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ నెన్నూరు గ్రామానికి చెందిన ధరణి ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 575 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీ ఒంగోలుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ధరణిని కేకేవీ పురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈఓలు, తోటి విద్యార్థులు అభినందించారు.

# భక్తిశ్రద్ధలతో అంజన్నకు విశేష పూజలు

ప్రజాభూమి సింహాద్రిపురం

సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ



ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్ సిటీ నిర్మాణ పనులు చేపడుతున్న బి.వి.ఎస్.ఆర్. కంపెనీకి చెందిన వాహనాలను అడ్డుకున్న తీగపాలెం గ్రామస్తులు

- బి.వి.ఎస్.ఆర్. కంపెనీ తీరుపై భగ్గుమన్న తీగపాలెం గిరిజనులు
- పునరావాసం కల్పించకుండానే తొలగిస్తారా అంటూ గిరిజనుల ఆవేదన.
- నష్టపరిహారం లేకుండా ఇళ్లను తొలగిస్తున్నారని ఆగ్రహం
- 'క్రిస్ సిటీ' పనుల కోసం ఇళ్ల తొలగింపునకు యత్నం
- పునరావాసం కల్పించకుండానే తొలగిస్తారా? - భగ్గుమన్న తీగపాలెం గిరిజనులు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
క్రిస్ సిటీ నిర్మాణ పనులు చేపడుతున్న బి.వి.ఎస్.ఆర్. కంపెనీకి చెందిన వాహనాలను తీగపాలెం గ్రామస్తులు అడ్డుకుని శనివారం ఆందోళన వ్యక్తం చేయడంతో ఆ సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం, చిల్లకూరు మండలం లింగవరం పంచాయతీ పరిధిలోని తీగపాలెం గిరిజనులు శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 'క్రిస్ సిటీ' నిర్మాణ పనుల పేరుతో ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా, పునరావాసం కల్పించకుండా తమ ఇళ్లను తొలగించేందుకు వచ్చిన బి.వి.ఎస్.ఆర్ కంపెనీ వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు పోరాడుతామని వారు స్పష్టం చేశారు.

**నిరసన బాటలో బాధితులు**

క్రిస్ సిటీ నిర్మాణ పనులలో భాగంగా రహదారి నిర్మాణం కొరకు బి.వి.ఎస్.ఆర్ కంపెనీ ప్రతినిధులు , అధికారులు భారీ యంత్రాలతో తీగపాలెం చేరుకున్నారు. సుమారు 14 గిరిజన కుటుంబాల ఇళ్లను ఖాళీ చేయించాలని ప్రయత్నించగా, గ్రామస్తులు ఒక్కసారిగా నిరసనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా తాము ఇక్కడే నివాసముంటున్నామని, కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేదా నష్టపరిహారం చెల్లించకుండా తమను రోడ్డున పడేయడం దారుణమని గిరిజనులు కన్నీటి పర్యంతమయ్యారు.



**అధికారుల తీరుపై ఆగ్రహం, శనివారం సదరు కంపెనీ గ్రావెల్ వాహనాల అడ్డగింత**

స్థానిక రెవెన్యూ అధికారులు, ముఖ్యంగా వీఆర్వో, కంపెనీకి వత్తాసు పలుకుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, వీటిని ప్రభుత్వ భూములని పేర్కొంటూ గిరిజనులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని వారు వాపోయారు. "రెక్కాడితే గాని డొక్కాడని మమ్మల్ని, మా నివాసాల నుండి వెళ్లగొట్టేందుకు యత్నిస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాయడం అన్యాయం" అని వారు మండిపడ్డారు.

**ముందుగానే నష్టపరిహారం చెల్లించాలి లేదా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి**

మరో వైపు గత కొంతకాలంగా సదరు సంస్థకు చెందిన గ్రావెల్ టిప్పర్లు ఈ ప్రాంతం గుండా అధికంగా తిరుగుతుండటంతో నిరంతరం దుమ్ము, ధూళి సమస్యలతో వృద్ధులు, పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా 14 గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా నష్టపరి హారం చెల్లించాలని లేనిపక్షంలో ముందుగానే సదరు బాధిత గిరిజనులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అప్పుడే ఖాళీ చేస్తామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. అధికారుల మొద్దునిద్ర వీడి, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి, గిరిజనుల హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు అండగా స్థానికులు కూడా నిరసనలో పాల్గొనడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమకు తగిన న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ ఘటనపై స్థానిక యంత్రాంగం మరియు సంబంధిత అధికారులు స్పందించి, బాధితులకు తగిన పునరావాసం కల్పిస్తారా లేదా అనేది వేచి చూడాలి.

# పునరావాసం లేకుండా ఇళ్ల తొలగింపా..? క్రిస్ సిటీ పనులను అడ్డుకున్న తీగపాలెం గిరిజనులు

ప్రజాభూమి ప్రతినిధి చిల్లకూరు
చిల్లకూరు మండలం తీగపాలెంలో ఉద్రిక్తత (బి వి ఎస్ ఆర్ ) కంపెనీ వాహనాల అడ్డగింత నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయ గృహాలు ఇవ్వాలని డిమాండ్. గూడూరు నియోజకవర్గం, చిల్లకూరు మండలం లింగవరం పంచాయతీ పరిధిలోని తీగపాలెం గ్రామంలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. క్రిస్ సిటీ నిర్మాణ పనులు చేపడుతున్న దీయా= కంపెనీకి చెందిన వాహనాలను గ్రామస్తులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. పునరావాసం కల్పించకుండా, ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమ ఇళ్లను తొలగించేందుకు అధికారులు, కంపెనీ ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని గిరిజనులు ఆరోపించారు. క్రిస్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రహదారి నిర్మాణం కోసం కంపెనీ ప్రతినిధులు భారీ యంత్రాలతో గ్రామానికి చేరుకోగా, సుమారు 14 గిరిజన కుటుంబాల ఇళ్లను ఖాళీ చేయించాలని సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత కుటుంబాలు, తమకు ప్రత్యామ్నాయ నివాసాలు లేదా తగిన నష్టపరిహారం కల్పించకుండానే ఇళ్లను తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశాయి.



ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, తరతరాలుగా ఇదే ప్రాంతంలో నివసిస్తున్న తమను ఒక్కసారిగా నిరాశ్రయులను చేయాలని చూడడం దారుణమని పేర్కొన్నారు. పేద గిరిజన కుటుంబాల జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారుల తీరుపై కూడా గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తూ తమపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల పేరుతో గిరిజనులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడం సరైన పద్ధతి కాదని అన్నారు. అదే సమయంలో క్రిస్ సిటీ పనుల కోసం తిరుగుతున్న గ్రావెల్ టిప్పర్ల వల్ల గ్రామంలో దుమ్ము, ధూళి అధికమై చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 14 గిరిజన కుటుంబాలకు ముందుగా నష్టపరిహారం చెల్లించాలని లేదా ప్రత్యామ్నాయ గృహాలు నిర్మించి ఇవ్వాలని, ఆ తర్వాతే ఇళ్లను ఖాళీ చేసే విషయాన్ని పరిశీలిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. స్థానికులు కూడా బాధిత కుటుంబాలకు మద్దతుగా నిరసనలో పాల్గొనడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ అంశంపై అధికారులు ఎలా స్పందిస్తారు, బాధిత కుటుంబాలకు పునరావాసం మరియు న్యాయం కల్పిస్తారా లేదా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించాలి -నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
167-తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఏజెంట్లందరూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి కోరారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026'లో భాగం గా, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో శనివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో అవగాహన సదస్సు (ఓరియంటేషన్ వర్క్‌షాప్) నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక సమగ్ర సవరణ అంటే ఏమిటి, దాని ఆవశ్యకత, ఉద్దేశం మరియు అందులోని వివిధ ప్రక్రియలను క్షుణ్ణంగా వివరించారు.





అలాగే, ప్రస్తుతం జరుగుతున్న ఎలక్టార్ మ్యాపింగ్, ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్, ఎన్యూమరేషన్ (గణన) దశతో పాటు, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల కీలక పాత్ర గురించి అవగాహన కల్పించారు. వంద శాతం పారదర్శకమైన, స్వచ్ఛమైన తుది ఓటర్ల జాబితా తయారీకి ఏజెంట్లందరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అన్నీ రాజకీయ పార్టీలు తమకు సంబందించిన బూత్ లెవల్ ఏజెంట్ల యొక్క నియామకమును నిర్దేశించిన ఫార్మాట్ నందు ఆఫీసుకు రెండు రోజులలో సమర్పించాలని కోరడమైనది. ఎనుమేరేషన్ ఫారం నందు ప్రస్తుత ఓటరు యొక్క లేటెస్ట్ పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటో సేకరించి అందజేయాలని కోరారు. అనంతరం బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక సమగ్ర సవరణ పై వ్యక్తం చేసిన పలు సందేహాలు, అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో సహాయ ఓటర్ల నమోదు అధికారులు అమరయ్య, వి.సురేష్ బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ సుధాకర్ నాయక్ మరియు అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధం మాట తప్పి రూ. 3500 కోట్లు దోచుకున్నారు

## 30 వేల ఆడపడుచుల పుస్తెలు తెంచిన గొడ్డలి పార్టీ నాయకుడు - మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:
మద్యం కుంభకోణంలో పాము పుట్టలో నుంచి బయటికి వచ్చినట్టుగా రోజుకొక గొడ్డలి పార్టీ నాయకుడి పేరు బయటికి వస్తుంది. గత ఐదేళ్లలో ఎన్నికల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని సాంఘిక శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మద్యం డిపోల నుంచి మద్యం దుకాణాలకు ఉన్న చార్జీలు రూ.13 నుంచి 35 రూపాయలు పెంచిన రూ.400 కోట్లు దోచుకున్నారు. వాసుదేవ రెడ్డిని బేవరేజ్ ఎండీగా చేసి రూ.3500 కోట్లు కొల్లగొట్టారు. మీరు ప్రజలకు సమాధానం చెప్పాల్సింది పోయి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. మద్యం కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ పీఏ కెఎన్ ఆర్ వేల కోట్ల రూపాయలు దోపిడీ చేశాడంటే అసలు లబ్దిదారుడు జగన్ ఎంతో దోచుకున్నాడో ప్రజలు అర్థం చేసుకోగలరని అన్నారు. కల్తీ మద్యం ద్వారా 30 వేల మంది ఆడపడుచుల పుస్తెలు తెంచినటువంటి నీకు ఆడపడుచుల ఉసిరే తగిలిందనే విషయాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకో అని అన్నారు. చిన్నాన్ననే చంపేసిన నీకు రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, వాళ్ల ప్రాణాలు లెక్కలేదని ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. దేశంలో ఎక్కడైనా గానీ విక్రయించే మద్యంలో ఆల్కహాల్ ఉంటుంది. కానీ జె-బ్రాండ్స్ లో మాత్రం పైరోగలాల్, డై ఇథైల్ థాలేట్, ఐసోపులెరిక్ యాసిడ్ వంటి హానికారక రసాయనాలు ఉన్నాయి. చిత్తూరు నుంచి శ్రీకాకుళం ప్రతి చోటా మీ నాయకుల పాత్ర ప్రాధాన్యత ప్రజలకు అర్థమవుతోంది. చెవిరెడ్డి దగ్గర నుంచి కారుమూరి నాగేశ్వరరావు, మిథున్ రెడ్డి వీళ్లందరిని ఈడీ ప్రశ్నిస్తుందంటే ఒకసారి ఆలోచించుకోవాలి. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే, గొడ్డల పార్టీ నాయకుడైన సైకో జగన్‌నే అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం పాలసీని తీసుకొచ్చి నాణ్యమైన మద్యాన్ని ఇస్తున్నాం. ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే యాప్ తీసుకొచ్చేసి, మద్యం ఎక్కడైనా నకిలీ, కల్తీ జరగకుండా పారదర్శకంగా ముందుకు వెళ్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం.



కారుమూరి నాగేశ్వరరావు సుదర్శన్ కన్స్ట్రక్షన్ సంస్థ పేరుతో 15 కోట్లు దోచుకున్నారు. 2023 డిసెంబర్ 16 తర్వాత కాట్వాడులని ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్‌కు రవాణా ట్రాన్స్‌పోర్ట్ అప్పించిన వాస్తవం కాదా? ఈ సంస్థ ద్వారా కిలోమీటర్‌కు రూ.35-30 పైసలు (నెల్లూరు, కోస్తా), రూ. 35. 90 (ఉత్తరాంధ్ర) లెక్కన రవాణా చార్జీలు చెల్లించేలా కాంట్రాక్టు ఖర్చు కుదుర్చుకొని దోపిడీ చేసిన వాస్తవం కాదా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాణ్యమైన బ్రాండ్లు ఇవ్వడమే కాకుండా 3,396 మద్యం షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించి ట్రాన్స్‌పరెంట్‌గా నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తూ, పేదలను దృష్టిలో ఉంచుకొని 99 రూపాయలకే అంతర్జాతీయ, జాతీయ కంపెనీల మద్యాన్ని ఇస్తున్నాం. కల్తీ మద్యం ద్వారా మీరు జరిగిన సొమ్ముతో బంగారు కొనుగోలు, రియల్ ఎస్టేట్, సినిమాలు తీయడం, జింబాబ్వే, టాంజానియా, జాంబియా వంటి దేశాల్లో మైనింగ్, దుబాయ్, ఆఫ్రికా దేశాల్లో షెల్ కంపెనీల ద్వారా తరలించడం, ఎన్నికల్లో ఖర్చు పెట్టడం, మీ నాయకులు అక్రమ సొమ్మును పంచుకోవడం, ఇవన్నీ ఎంక్వైరీలో బయటకు రావడం వాస్తవం కదా? ప్రజా తీర్పులోనే మిమ్మల్ని ఇంటికి పంపించిన పరిస్థితి గుర్తు చేసుకోమని అన్నారు.. ఏదైనా సిద్ధంగా ఉండు. తొందరలోనే మీ తాడేపల్లి ప్యాలెస్‌కు కూడా మద్యం మూలాలు చేరుతాయి. జగన్ రెడ్డి సైకో వర్తనం వల్ల రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి పోయింది. చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. 23లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసి వేశారు. దేశం, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కూటమి ప్రభుత్వానికి 90% స్ట్రైక్ రేట్ తో గెలిపించారనే విషయాన్ని గొడ్డలి పార్టీ గుర్తు చేసుకోవాలని అన్నారు.

# యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యం

## యోగా పోటీలకు విశేష స్పందన.కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి
యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం కచ్చపి ఆడిటోరియం లో నిర్వహించిన యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. యోగాంధ్ర -2026 లో భాగంగా శనివారం కచ్చపి ఆడిటోరియంలో పలు విభాగాల్లో పోటీలను నిర్వహించిన పోటీలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య తో కలసి కమిషనర్ పరిశీలించారు. పలువురు యోగా గురువులు జడ్జిలుగా పాల్గొని యోగాలో ప్రతిభ కనపరిచిన వారిమి గుర్తించడం జరిగిందని తెలిపారు. జూనియర్స్, యంగర్స్, సీనియర్స్ మూడు కేటగిరిలుగా యోగా పోటీలు నిర్వహించామని తెలిపారు. వార్డు స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిస్తే రాష్ట్ర స్థాయిలో పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలనే లక్ష్యంతో ఈ యోగా పోటీలను నిర్వహిస్తున్నామని తెలుపారు. ఈ యోగా పోటీల్లో నగరపాలక సంస్థ రెవిన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, యోగా గురువులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా అభివృద్ధి, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం కృషి అభినందనీయం

**తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ముందుకు**

**పైలెట్ ప్రాజెక్టుగా మచిలీపట్నం మండలంలోని పెదపట్నం, పల్లెతుమ్మలపాలెం గ్రామాల ఎంపిక**



ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
జిల్లా అభివృద్ధి, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు.రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు జయన్, యాదవ్ శనివారం మధ్యాహ్నం మచిలీపట్నం నగరంలోని రహదారులు భవనాల శాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సౌకర్యాల కల్పన, మహిళా సాధికారత, బీచ్ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడం, యువతకు ఉపాధి కల్పన శిక్షణలు, సివిల్ సర్వీసెస్ ఆశావహులకు ఉచిత శిక్షణ వంటి అంశాలపై మంత్రి, జిల్లా కలెక్టర్‌తో సంస్థ ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. తీర ప్రాంత గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించే దిశగా పైలెట్ ప్రాజెక్టుగా మచిలీపట్నం మండలంలోని పెదపట్నం, పల్లెతుమ్మలపాలెం గ్రామాలను ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆయా గ్రామాల్లో చెరువు నీటిని శుద్ధి చేసే ప్రత్యేక ప్యూరిఫికేషన్ యూనిట్లను ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటిని పైప్‌లైన్ల ద్వారా ప్రతి ఇంటికి నేరుగా సరఫరా చేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు అమలు ద్వారా లభించే అనుభవాల ఆధారంగా తీర ప్రాంతంలోని ఇతర గ్రామాలకు కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనపై మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ముందుకు వచ్చిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులను వారు ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మహిళలకు మిషన్ కుట్టు, అల్లికలు, ఎండు చేపలు రొయ్యల వ్యాపార నిర్వహణపై శిక్షణ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అలాగే ప్రతి ఏడాది 20 మంది సివిల్ సర్వీసెస్ ఆశావహులకు ఉచిత శిక్షణ అందించి యువతకు ప్రోత్సాహం కల్పించనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు సంస్థ ప్రతినిధులు మచిలీపట్నం మండలంలోని పెదపట్నం గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి తుపాను షెల్టర్ వద్ద ఓవర్ హెడ్ ట్యాంకు, గ్రామంలో నీటి సరఫరా స్థితిగతులను తెలుసుకున్నారు.గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఈ సుధాకర్, ఏఈ సుగుణ, డి ఆర్ డి ఎ విభాగం అధికారులు ఈ చర్చలో పాల్గొన్నారు.

# పంట పొలాలలో ఇసుక ట్రాక్టర్ బోల్తా

- పూడి గ్రామంలో రైతుల ఆగ్రహం
- 25 ఇసుక ట్రాక్టర్లను హై స్కూల్ లో బంధించిన రైతులు
- పూర్తిగా ధ్వంసం అయిన పూడి,పెన్నలపాడు ఆర్ అండ్ బి రోడ్డు

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
మండలంలోని పూడి గ్రామ పంట పొలాల్లో అక్రమంగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది.వరి పొలంలోకి దూసుకెళ్లి ట్రాక్టర్ పూర్తిగా తిరగబడటంతో పంటకు భారీగా నష్టం వాటిల్లింది.ఈ ఘటనతో ఆగ్రహించిన రైతులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై మండిపడ్డారు. పంట పొలాల మీదుగా ఇసుక ట్రాక్టర్లు తిప్పడం వల్ల ప్రతిరోజూ పంటలు నాశనం అవుతున్నాయని వాపోయారు. దీని ఫలితంగా శ్రీకాళహస్తి నుండి పూడి పెన్నలపాడుకు వెళ్ళు ఆర్ అండ్ బి రహదారి పూర్తిగా నాశనమైంది. దీంతో సుమారు 25 ఇసుక ట్రాక్టర్లను అడ్డగించి పూడి గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో బంధించారు.వరి పొలంలో పూర్తిగా తిరగబడి ఉంది. పంట నీటిలో మునిగిపోయింది.జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఇసుక లోడ్‌తో ఉన్న 25 ట్రాక్టర్లను రైతులు నిలిపివేశారు.పంట నష్టానికి నష్టపరిహారం చెల్లించాలని, పొలాల మీదుగా ఇసుక రవాణా ఆపాలని అధికారులను కోరుతున్నారు.రోజూ డజన్ల కొద్దీ ఇసుక ట్రాక్టర్లు మా పొలాల గట్ల మీద నుంచే వెళ్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో ఇలా బోల్తాపడి నష్టం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఘటనా స్థలానికి రెవెన్యూ, పోలీసు అధికారులు చేరుకొని రైతులతో చర్చలు జరుపుతున్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 10
ఆదివారం 14 జూన్ 2026

# తిరుపతి సభ రెండేళ్ల విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ.

**- సూపర్ సిక్స్ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సైలెంట్ అయ్యారు. - మేనిఫెస్టోను జేబులో పెట్టి.. ఎర్రబుక్‌ను అరచేతిలో పెట్టుకున్నారు. - రాష్ట్రంలో ఏ పని జరగాలన్నా 'క్యాష్--రాజేష్--లోకేష్' ఫార్ములానే అమలవుతోంది.- డీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పలేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం దురదృష్టకరం.- సకల విఫల శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రాష్ట్రాన్ని నడిపిస్తారా?- దూకుడు సినిమాలో బ్రహ్మానందంలా పవన్ కళ్యాణ్‌ను వాడుకుంటున్నారు.- ప్రశ్నించడానికి పార్టీ పెట్టానన్న పవన్.. ఇప్పుడు మమ్మల్ని తిట్టడానికే పరిమితమయ్యారు.- పుట్టిన పసిబిడ్డల నుంచి రైతుల దాకా అందరినీ దగా చేసి వెన్నుపోటు పొడిచారు.- రెండేళ్లకే చంద్రబాబు రెండు చేతులు ఎత్తేసి ఆఖరి గీతం పాడేశారు. - రూ.3.60 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు.- లోకేష్ నడుపుతున్న విద్యాశాఖలో అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదు. - విద్యను ప్రైవేట్‌కు అమ్మేసి ప్రభుత్వ విద్యకు పాతరేశారు.- డీఎస్సీలో ఉద్యోగాలను సూట్‌కేసులకు అమ్ముకునే పరిస్థితి తీసుకొచ్చారు. - తల్లికి వందనం అన్నారు.. పిల్లలకు మంగళం పాడేశారు - కరెంట్ ఛార్జీలు తగ్గించినట్లు నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. - నిరూపించలేకపోతే చంద్రబాబు, లోకేష్, పవన్ తమ పదవులకు రాజీనామా చేస్తారా? - రాష్ట్రంలో ఉన్నది గంగిరెద్దుల గంటలే తప్పు.. పరిపాలన అనే పంట లేదు. - రాష్ట్ర చరిత్రలో అత్యుత్తమ పరిపాలన వైయస్ జగన్ దే.- గ్రామ స్వరాజ్యాన్ని గ్రామాలకు చేర్చిన నాయకుడు వైయస్ జగన్ - అమరావతి ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు.:- వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి:
తిరుపతిలో ఈ నెల 12న కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభ వాస్తవానికి విజయాలను చెప్పుకునే సభ కాదని, ఆరు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ అని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు విజయోత్సవాల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం "క్యాష్--రాజేష్--లోకేష్" ఫార్ములాతో పాలన సాగుతోందని ఆరోపించిన ఆయన, డీఎస్సీ నుంచి సంక్షేమ పథకాల వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రెస్‌మీట్‌లో తాటిపర్తి చంద్రశేఖర్ ఏమన్నారంటే..

తిరుపతిలో ఈ నెల 12న జరిగినది కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ. చంద్రబాబు రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు ఏంటో గూగుల్‌లో వెతికినా కనిపించవు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం పరీక్ష రాయకుండానే పాస్ అయినట్లు ఉంది. ఆ రోజు సూపర్ సిక్స్ అన్న చంద్రబాబు, ఈ రోజు సూపర్ సైలెంట్ అయ్యారు. ఎన్నికల మేనిఫెస్టోను మూసేసి ఎర్రబుక్ పాలన ప్రారంభించారు. రాష్ట్రంలో ఇప్పుడు ఏ పని జరగాలన్నా 'క్యాష్--రాజేష్--లోకేష్' అనే కొత్త ఫార్ములానే అమలవుతోంది. రాజేష్ స్కెచ్ వేస్తే, లోకేష్ దాన్ని అమలు చేస్తున్నాడు. ఈ ఇద్దరూ కలిసి రాష్ట్ర వ్యవస్థలను భ్రష్టు పట్టించారు.
డీఎస్సీ -2025 వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై ప్రెస్‌మీట్ పెట్టి సమాధానం చెప్పలేని వ్యక్తి మంత్రి ఎలా అవుతారు? డీఎస్సీ అక్రమాలపై వివరణ ఇవ్వలేని సకల విఫల శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రాష్ట్రాన్ని నడిపిస్తారా? అలాంటి వ్యక్తి విజయోత్సవ సభ వేదికపై నిలబడి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ని విమర్శించడం విడ్డూరంగా ఉంది. దూకుడు సినిమాలో బ్రహ్మానందం పాత్రను ఎలా ఉపయోగించారో, అలాగే చంద్రబాబు--లోకేష్‌లు పవన్ కళ్యాణ్‌ను ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగినప్పుడల్లా పవన్‌ను రంగంలోకి దింపుతున్నారు. ప్రశ్నించడానికి పార్టీ పెట్టానని చెప్పుకున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుతూ ప్రత్యర్థులను దూషించడానికే పరిమితమయ్యారు. పుట్టిన పసిబిడ్డల నుంచి రైతుల వరకు ప్రతి వర్గాన్నీ మోసం చేసి వెన్నుపోటు పొడిచారు. తిరుపతిలో నిర్వహించిన సభ విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ అని వారి ప్రసంగాలే నిరూపించాయి.

- సింగిల్ విండో పాలన

రాష్ట్రంలో ప్రస్తుతం 'క్యాష్-రాజేష్--లోకేష్' అనే సింగిల్ విండో పాలన నడుస్తోంది. ఈ కొత్త ఫార్ములాతో పుట్టిన పసిబిడ్డల నుంచి రైతుల వరకు ప్రతి వర్గాన్నీ మోసం చేసి వెన్నుపోటు పొడిచారు. రెండేళ్లలోనే చంద్రబాబు రెండు చేతులు ఎత్తేశారు. రూ.3.60 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. ఆర్థిక లోటును పెంచి ఖజానాను ఖాళీ చేశారు. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలు చెప్పుకునే పరిస్థితి కూడా ప్రభుత్వానికి లేదు. నారా లోకేష్ నిర్వహిస్తున్న విద్యాశాఖలో అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదు. అక్కడే రాష్ట్ర తిరోగమనం మొదలైంది. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి ప్రైవేటుకు అప్పగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు తగ్గిపోయాయి, ఫలితాలు పడిపోయాయి, పేపర్ లీకులు పెరిగాయి. ఉద్యోగాలు సూట్‌కేసులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. డీఎస్సీలో విద్యాశాఖ ఉద్యోగులకే మొదటి ర్యాంకులు రావడం, గోల్డ్ మెడలిస్టులకు ఉద్యోగాలు రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. తల్లికి వందనం అని చెప్పి పిల్లలకు మంగళం పాడారు. సుమారు 20 లక్షల మంది విద్యార్థులను అర్హుల జాబితా నుంచి తొలగించారు. ఒకవైపు తప్పు చేసిన వారిని వదిలిపెట్టమని సినిమా డైలాగులు చెబుతుంటే, మరోవైపు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు. సొంత పార్టీ నేతల తప్పులను కప్పిపుచ్చుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. తిరుపతి విజయోత్సవ సభలో చంద్రబాబు అబద్ధాలు చెప్పారు. రెండేళ్లలో ఒక్క రూపాయి అయినా కరెంట్ చార్జీలు తగ్గించినట్లు నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను. నిరూపించలేకపోతే చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ తమ పదవులకు రాజీనామా చేస్తారా? పని కంటే ప్రచారానికే ఈ ట్రిబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. వైయస్ జగన్ పాలనలో సంక్షేమం, పారదర్శకత, గ్రామ స్వరాజ్యం కనిపించాయి. కానీ రూ.3.60 లక్షల కోట్ల అప్పులు చేసినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేకపోయిన చంద్రబాబు ప్రభుత్వం మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాలను మోసం చేసింది. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, రైతు హామీలు ఏమయ్యాయో సమాధానం చెప్పాలి. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకుండా పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ, అప్పులు--అవినీతితో పాలన సాగిస్తున్నారు. తిరుపతి విజయోత్సవ సభతోనే కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను తానే అంగీకరించుకుందని స్పష్టమైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన 143 హామీలపై సమాధానం చెప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వ మోసాలను గుర్తించి తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు.

# 'సర్' కార్యక్రమం ప్రజలందరి కోసం!

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్
రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల సంఘం ప్రచురించే ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సరిచేసి, నూతన ఓటర్ల చేర్పు మరియు అనర్హుల తొలగింపు చేసి పారదర్శకమైన, సవివరమైన జాబితా సిద్ధం చేయడానికి ఉద్దేశించి ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'సర్' కార్యక్రమం ప్రజలందరి కోసం అని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే 'సర్' -2026 కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 294 బూత్ ల పరిధిలో బిఎల్ఓ లు మరియు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు నిర్వహించాల్సిన పాత్రపై శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని రాజకీయ పార్టీల బిఎల్ఏ లతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల అధికారి మరియు ఆర్డీవో భానుప్రకాష్ గారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలోని




సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. పైన పేర్కొన్న సమావేశంలో పాల్గొన్న శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు 'సర్' కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని అధికారుల నుండి తెలుసుకోవడమే కాక, అందులో ఎదురయ్యే కొన్ని అవాంతరాలను కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి మార్గాలు సూచించమని విన్నవించడం జరిగింది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా కీర్తింపబడుతున్న భారతదేశంలో చట్టసభలకు ఎన్నికల నిర్వహణ మరియు వాటి పర్యవేక్షణకు రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమీషన్ చూసుకుంటుందని, అటువంటి ఎన్నికల కమీషన్ రూపొందించిన ఎన్నికల ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా సిద్ధం చేయడానికి ఉద్దేశించిన కార్యక్రమమే సర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అని, దీనిలో పౌరులందరూ బాధ్యతగా పాల్గొని సహకరించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, రాష్ట్ర కార్యదర్శి యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు ఛైర్మన్ షేక్ ఖాదర్ బాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంఠా రమేష్, గోపీనాథ్, పేట బాలాజీ, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, ఢిల్లీ బాబు, యూనిట్ ఇన్‌ఛార్జి రామకృష్ణ యాదవ్, వినయ్, కిట్టు, కె.వి.ప్రతాప్, భగత్, నాగరాజు, భాస్కర్, మధు, రాకేష్, సుప్రజ, మురళి, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే రండి.. ఆధారాలతో నిరూపిస్తా

## -ఎంపీ వైఎస్అవినాష్ రెడ్డికి ఛాలెంజ్ విసిరిన ఎంపీటీసీ విశ్వనాథ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల
ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది వైకాపా నాయకులే అని, గత ఐదేళ్లలో మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో ఎవరు ఎంత కమిషన్ తిన్నారో నా దగ్గర ఆధారాలు ఉన్నాయని?మెడికల్ కాలేజీ నిర్మాణంలో భారీ కంకర కుంభకోణం జరిగింది అని హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి లు అన్నారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో విశ్వనాథరెడ్డి విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ3 కిలోమీటర్ల దూరంలో కంకర అందుబాటులో ఉన్నా, కమిషన్ల కోసం మీ బంధువులు, ప్రవీణ్ బ్యాచ్ కలిసి 40 కిలోమీటర్ల దూరం నుండి తోలి ప్రజాధనాన్ని వృధా చేయడం జరిగిందన్నారు. మీ మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాదే స్వయంగా నా దగ్గర కన్నీళ్లు పెట్టుకుని, మిమ్మల్ని నమ్మి కంకర మిషన్ అద్దెకు తీసుకుని అప్పుల పాలయ్యాలని బాధపడడం జరిగిందన్నారు. సచివాలయాలు, జగనన్న కాలనీల నిర్మాణాల్లో వందల కోట్ల కమిషన్లు మీ జేబుల్లో వేసుకున్నది వాస్తవం కాదన్నారు.ఆ పనుల్లో ప్రతి పల్లె నాయకులు నష్టపోయారు, అందులో నేను కూడా ఒక బాధితుడినే అని ఆయన అన్నారు. గరండాల వంక వర్కుల్లో ఎవరెవరికి ఎంత పర్సంటేజ్ కమిషన్లు వెళ్లాయో అందరికీ తెలుసు అన్నారు. ప్రజాధనాన్ని వృధా చేసింది మీరే కాదా అన్నారు. ప్రజల సొమ్ము దోచుకోకూడదని, ప్రజా సేవ చేయాలని నిరంతరం భావించే వ్యక్తి బీటెక్ రవి అన్నారు. ఆయన అవినీతిపరుడు కాదు మీరు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి అన్నారు. ఎన్నికల ముందు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ. 1500 కోట్ల బిల్లులు చేసుకుంటే మీరెక్కడకు పోయారు అని ఆయన ప్రశ్నించారు.పులివెందుల ఆరు



మండలాలకు రావాల్సిన రూ. 650 కోట్ల పనులు ఎందుకు చేయించలేదు అని ప్రశ్నించారు. రాత్రి పూట 10-20 టిప్పర్లు పెట్టి ఇసుక దోపిడీ చేసింది ఎవరో అందరికీ తెలుసు అన్నారు. అప్పటి ఇసుక దందా వల్ల ఎంతోమంది భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడడం జరిగిందన్నారు. ఒక బాధ్యతాయుతమైన ఎంపీ స్థానంలో ఉండి ఈ స్థాయిలో అబద్ధాలు మాట్లాడటం, విమర్శలు చేయడం కరెక్ట్ కాదు అని ఎంపీ అవినాష్ రెడ్డి పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అనంతరం హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా మాట్లాడుతూఆరోపణలు చేసే ముందు అద్దంలో చూసు చూసుకోవాలన్నారు.2005 మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ వర్గీయులు ఇళ్లపై దాడులు చేసి, పోలీసుల ద్వారా వేధింపులు చేశారని ఆరోపణ.సతీష్ రెడ్డిని కూడా అరెస్ట్ చేసి అవమానించిన ఘటనలు గుర్తు చేస్తూ గతాన్ని మరవొద్దని సూచించారు.ముగ్గురాయి మైనింగ్‌పై ఆరోపణలు నిరాధారం అని, చట్టబద్ధమైన లీజుల కింద పనులు జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.మట్కా జూదం గురించి మాట్లాడే హక్కు వైఎస్సార్సీపీకి లేదు అని ఆయన అన్నారు. గత ఐదేళ్లు వైఎస్సార్సీపీ నాయకుల ఇళ్లలోనే మట్కా కేంద్రాలు నడిచాయని మీకు గుర్తు లేదా అని ప్రశ్నించారు.టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పులివెందులలో మట్కా లేకుండా పోయిందని ఆయన అన్నారు.జూద కార్యకలాపాలు కూడా వైఎస్సార్సీపీ హయాంలోనే విస్తరించాయని ఆయన ఆరోపించారు.ఇసుక దోపిడీపై మాట్లాడే ముందు గతాన్ని గుర్తు చేసుకోవాలని ఆయన అవినాష్ రెడ్డికి సూచించారు.వైఎస్సార్సీపీ నేతల టిప్పర్లు సీరియల్ లేకుండా ఇసుక రీచ్‌లలో తిరిగాయని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇసుక దొరకక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విషయం మీకు గుర్తు లేదా అన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను తక్కువ ధరలో అందుబాటులోకి తెచ్చిందని కార్మికులు ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లకు ఉపాధి కల్పించిన ఘనత బీటెక్ రవిదేనని ఆయన అన్నారు. చికెన్ వ్యాపారంలో గతంలో ఏకపక్ష దోపిడీ జరిగిందని ఆయన అన్నారు.టీడీపీ వచ్చిన తర్వాత పోటీ పెరిగి చికెన్ ధరలు తగ్గాయని పేర్కొన్నారు.బీటెక్ రవి కమిషన్లు తీసుకొని బతికిన వ్యక్తి కాదని ఆయన అన్నారు. పులివెందుల చరిత్రలో ఎక్కువ హత్యలు ఏ హయాంలో జరిగాయో ప్రజలకు అన్నితెలుసని ఆయన అన్నారు.2019 తర్వాత నా ఇంటిపై దాడులు జరిగాయని,నా తమ్ముడిపై హత్యాయ త్నం వాస్తవం కాదా అని అన్నారు.మీరు నేర్పిన రాజకీయ గుణపాఠాన్నే మున్సిపల్ ఎన్నికల్లో తిరిగి నేర్పిస్తామని ఆయన వైకాపా నాయకులను హెచ్చరించారు.టీడీపీకి పులివెందుల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన అన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు కాలేదన్న ఆరోపణలను ఆయన ఖండించారు.ఉచిత గ్యాస్, తల్లికి వందనం, ఉచిత బస్సు, పెన్షన్ వంటి హామీలు అమలు చేశామని ఆయన పేర్కొన్నారు. రైతులకు వైఎస్సార్సీపీ పాలనలో ఎలాంటి మేలు జరగలేదని ఆయన విమర్శించారు.పులివెందులకు నీళ్లు తీసుకురావడంలో చంద్రబాబు నాయుడు, సతీష్ రెడ్డి కృషి చేశారని తెలిపారు.గతంలో తాగునీటి పేరుతో ట్రాక్టర్ల ద్వారా డబ్బులు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం వేసవిలో కూడా నీటి సమస్య లేకుండా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన అన్నారు.ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఈ కార్యక్రమంలో కాశీం వల్లి తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# గ్రీన్ వైజాగ్ -హెల్తీ వైజాగ్ దిశగా జీవీఎంసీ అన్ని జోన్లలో రూ.10.97 కోట్లతో 60 థీమ్ పార్కుల అభివృద్ధి

## - జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం




విశాఖ నగరాన్ని పచ్చదనం, ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ హిత రవాణా, వారసత్వ పరిరక్షణకు ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పలు వినూత్న కార్యక్రమాలను చేపడుతోందని ,ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక భాగస్వామ్యం, వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని ఆ దిశగా నగరంలో 60 థీమ్ పార్కులు, సైకిలింగ్ ట్రాక్ లు, హెరిటేజ్ వాకింగ్ ట్రాక్ ను అభివృద్ధి పరచడం జరుగుతున్నదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు.

**1) రూ.10.97 కోట్లతో 60 థీమ్ పార్కుల అభివృద్ధి:**

జీవీఎంసీ పరిధిలో గల అన్ని జోన్లలో ప్రస్తుతం మొత్తం 174 పార్కులు ఉండగా, వాటిలో 151 ఎకరాల విస్తీర్ణంలో 139 కాలనీ పార్కులు ఉన్నాయని, వాటిలో మరింత అభివృద్ధి అవసరమున్న 60 పార్కులను గుర్తించి ఆరు ప్యాకేజీలుగా విభజించి, మొత్తం రూ.10.97 కోట్ల (రూ.1097.41 లక్షలు) అంచనా వ్యయంతో ప్రత్యేక థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయనున్నామన్నారు .ప్రతి పార్కుకు ప్రత్యేక థీమ్ తో అనగా ప్రకృతి,సాహస క్రీడలు ,ఫిట్‌నెస్ ,చిన్నారుల వినోదం, ఇతర ప్రత్యేక అంశాలతో కూడిన థీమ్‌లు ఉంటాయన్నారు. అలాగే ఈ థీమ్ పార్కులు సుందరమైన ఉద్యానవనాలు, పుష్పవాటికలు,నడక, జాగింగ్ ట్రాక్‌లు,థీమ్ ఆధారిత చిన్నారుల ఆట పరికరాలు,ఓపెన్ జిమ్‌లు,యోగా జోన్‌లు,సాంస్కృతిక, విద్యా ప్రదర్శనలు,శిల్పాలు, మ్యూరల్స్, సమాచార బోర్డులు, ఫౌంటైన్లు ,నీటి అందాల ఏర్పాట్లు,ఆర్‌సీసీ బెంచీలు, సీటింగ్ అండ్ రెస్ట్ ఏరియా,సీసీటీవీ పర్యవేక్షణ,సౌర విద్యుత్ ఆధారిత లైటింగ్,తాగునీటి సదుపాయం,మరుగుదొడ్లు,విద్యుత్ దీపాలంకరణ, మొక్కలకు నీటి సరఫరా సదుపాయం. అలాగే వర్షపు నీటి సంరక్షణ ,పునర్వినియోగ పదార్థాల వినియోగం,స్థానిక, తక్కువ నీటితో పెరిగే మొక్కల నాటకం,పర్యావరణ పరిరక్షణకు అనుకూల చర్యలతో ఈ థీమ్ పార్కులను అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు.

**2) నగరంలో ప్రతి సోమవారం "సైక్లింగ్ డే"**

ప్రజల ఆరోగ్య పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఇంధన పొదుపు లక్ష్యాలతో జీవీఎంసీ పరిధిలో ప్రతి సోమవారాన్ని "సైక్లింగ్ డే"గా స్వచ్ఛందంగా ఆచరించాలని నిర్ణయించామన్నారు.అన్ని శాఖాధిపతులు (నూణం), జోనల్ కమిషనర్లకు అధికారిక సలహా జారీ చేసామని,అధికారులు, ఉద్యోగులు కార్యాలయాలకు వీలైనంత మేర సైకిళ్లపై రావాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలుకూడా స్వచ్ఛందంగా ఆచరించాలని , సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటం, మానసిక ఉల్లాసం పెరగడం, ఊబకాయం తగ్గడం , కాలుష్య నియంత్రణ, ఇంధన పొదుపు వంటి ప్రయోజనాలు కలుగుతాయని కమిషనర్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

## వైఎస్ఆర్సీపి నేత ఇంట విషాదం

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీపీ బ్రహ్మానందం రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం:
మండలం పరిధిలోని టీవీ సఫార్ల గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. శుక్రవారం రాత్రి గుండొడోకనం -- కొత్త రోడ్డు మార్గంలో రోడ్డు పక్కన పడి ఉన్న అనిల్ కుమార్ మృతదేహాన్ని గమనించిన వాహనదారులు, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుడి అకాల మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.




అండగా ఉంటాం: ఎంపీపీ

విషయం తెలుసుకున్న రామచంద్రాపురం మండల ఎంపీపీ ఏవీ బ్రహ్మానందం రెడ్డి శనివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి తమ్ముడు అనిల్ కుమార్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనిల్ కుమార్ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీపీ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాదాసు మురగయ్య,యశ్వంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,సెంథిల్ కుమార్, మధు, కురివి కుప్పం భాస్కర్ రెడ్డి, ఆళ్ల మడుగు మారయ్య,మహేందర్ రెడ్డి , అత్తూరు విజయకుమార్, బాదురు నాదముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలు పరిష్కార వేదిక

## - ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సకాలంలో అందించడమే మన ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే క్యాంప్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.లిఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి, గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలను స్వయంగా కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాను. తాగునీరు, సాగునీరు, అంతర్గత రహదారులు, పెన్షన్లు, రేషన్ కార్డులు మరియు స్థానిక సమస్యలపై ప్రజలు నా దృష్టికి తెచ్చిన వినతులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించాను.సమస్యల తీవ్రతను బట్టి.. అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశాను. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం సహించబోదని ఈ సందర్భంగా అధికారులకు స్పష్టం చేస్తున్నాను.

ప్రజాభూమి

జనరల్ 11

ఆదివారం 14, జూన్ 2026

# మట్టి రోడ్డును తలపిస్తున్న కుయ్యేరు- గొల్లపాలెం ప్రధాన రహదారి!...

- చినుకు పడితే చెరువులను తలపిస్తున్న రహదారిపై గుంతలు.
- ఈరహదారికి నిర్మాణంపై మండల ప్రజలు ఆశలు ఆవిరి.
- ప్రకటనలకే పరిమితం ఆచరణ శూన్యం.
- నిత్యం నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు.
- డ్రైన్లపై కూలదానికి సిద్ధంగా ఉన్న పురాతన వంతెనలు
- గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారి నిర్మాణంపై ప్రజలు ఆవేదన.





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

గొల్లపాలెం -కుయ్యేరు ప్రధాన రహదారి చినుకు పడితే మట్టి రోడ్డులా తలపించడమే కాకుండా రహదారి పొడవునా పడిన గుంతలు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారిపై గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో సుమారు ఐదు సంవత్సరాలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సైతం పూర్తి చేయకపోవడంతో ఈ రహదారి నిర్మాణంపై మండల ప్రజల ఆశలు ఆవిరై నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పలుమార్లు స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ నేటికీ ఈ రహదారి పనులు పునః ప్రారంభించకపోవడంతో మరింతగా ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. అయితే గొల్లపాలెం ,చేదువాడ, కాజులూరు , గ్రామాల్లో సుమారు 2.5 కిలోమీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం కావలసి ఉండగా ఇప్పటికే 2.43 సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి ఎట్టకేలకు పూర్తి చేశారు. దీనికి సంబంధించి ఇటీవల పది రోజుల క్రితం రూ 2.78 కోట్ల రూపాయలు నిధులు సంబంధిత కాంట్రాక్టర్కు విడుదల చేశారు. దీంతో తదుపరి బిటి రహదారి పనులు త్వరగా మొదలు పెడతారన్న ప్రజల ఆశలు నేటికీ పునః ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం వేసవి కాలం పూర్తయినప్పటికీ వర్షాలు ప్రారంభంతో ఈ రహదారి నిర్మాణం పనులు ఇప్పట్లో పునః ప్రారంభం కాకపోవడంతో ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. దీంతో ఇకనుండి వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మరింతగా ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకాయాతనే అని శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్డు పొడవునా రహదారి చిందరవందరగా తయారైంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో రహదారిపై మట్టి ట్రాక్టర్లు లారీలు ఇష్టారాజ్యంగా తిరగడంతో ట్రాక్టర్లు లారీలు జారిపడిన మట్టి కారణంగా వర్షం కురవడంతో మట్టి రోడ్డుగా తయారైంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం.సుమారు 12. 16 కిలోమీటర్ల పొడవు గల గొల్లపాలెం -కుయ్యేరు. ప్రధాన రహదారి నిర్మాణం పనులు ప్రారంభించి ఐదు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ అపనులు పూర్తవకాకపోవడంతో రహదారి చోదరికులు ఆయా గ్రామాల ప్రజల అవేదన వ్యక్తం చేస్తున్నారు .దీంతో ఈ రహదారికి ఇప్పట్లో మోక్ష లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సుమారు 37.32 కోట్ల రూపాయలు అంచనా(ఎన్డిబి) నిధులతో నిర్మాణం చేపట్టే ఈపనులకు నాడు మంత్రి వేణుగోపాల్ కృష్ణ హడావిడిగా ఈరహదారి నిర్మాణ వసులకు శంకుస్థాపన చేశారే తప్ప, ఈరహదారి నిర్మాణం పూర్తి చేయించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నాటి వైసీపీ మంత్రి వేణుగోపాల్ కృష్ణ 6నెలల్లోనే ఈరహదారిని వినియోగంలోకి తెస్తామని చెప్పారు. ఈరహదారి నిర్మాణం పనులు ప్రారంభించిన నాటి నుండి నత్తనడకగానే కొనసాగాయి, రహదారి వెడల్పు నెపంతో 13 కిలోమీటర్ల పొడవునా ఇరువైపులా పచ్చని చెట్లు పలుచోట్ల నరికేశారు. ముఖ్యంగా దుగ్గదుద్రు నుండి కుయ్యేరు మద్యలో ప్రధాన పదహరికి ఇరువైపులా భారీ వృక్షాలను సైతం సరికి తరలించుకు పోయారు. నాటి నుండి పలుమార్లు మండల పరిషత్ సమావేశాల్లో సైతం ప్రజాప్రతినిధులు అధికారులను అడిగినా సొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగానే దర్శనమిస్తున్నాయి. మామూలుగానే ఈ రహదారిపై ప్రయాణించేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పని పరిస్థితుల్లో ప్రయాణిస్తుండగా ఫోర్ వీలర్స్ ఆటోలు, తదితర వాహనాలు అయితే గొల్లపాలెం మీదుగా జగన్నాథగిరి . చేదువాడ, అలాగే కుయ్యేరు నుంచి మరో మార్గంలో వెళ్తున్నాయి. అత్యవసరమైతే గానే వెళ్ళలేని పరిస్థితి ఈరహదారికి దాపరించింది. రహదారి విస్తరణ పేరుతో మొత్తం 13కిలోమీటర్లు రహదారిని ధ్వంసం చేసి రహదారి చోదకులకు నిత్యం నరకయాతన అనుభవించేలా చేసారు. ఇకపోతే చినుకు పడితే చిత్తడే మండలకేంద్రంమైన కాజులూరుకు కుయ్యేరు, గొల్లపాలెం నుండి నిత్యం వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు చేరుకోవాల్సిన పరిస్థితి ఉండగా వీరికి ఈరహదారిపై ప్రయాణం నరకయాతన ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతాదోఅని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈరహదారిలో పలుమార్లు బైక్ యాక్సిడెంట్లు జరిగి సందర్భాలు ఉన్నాయి. నేతలు మారినా మారాతలు మారావా ?అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి దుస్థితి చూస్తుంటే అత్యవసరమైతే తప్ప వెళ్ళడానికి ప్రజలు సాహసం చేయలేదనడంలో ఎటువంటి సందేహం లేదు.

# కోనసీమ తిరుమల వాడపల్లికి పోటెత్తిన భక్తులు

- జోరు వానలోనూ కొనసాగిన భక్తుల రద్దీ.
- స్వామి వారిని దర్శించుకున్న కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్.





ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు.వేకువజామున స్వామివారికి అర్చకులు తొలి హారతి, మేలుకొలుపు సేవ నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం వర్షం కురిసినప్పటికీ భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గలేదు. ఏడు వారాల వాడపల్లి వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే విశ్వాసంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు ప్రదక్షిణలు చేసే భక్తులతో మాడవీధులు కిటకిటలాడాయి. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు హోరెత్తాయి. దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఛైర్మన్ వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ సూర్య చక్రధరరావు స్వయంగా క్యూలైన్లను, మాడవీధులను, అన్నదాన కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదం స్వీకరించారు.

**వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ :**

ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ శనివారం వాడపల్లి వెంకన్నను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం శేఖర్ మాస్టర్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత గురించి అధికారులు ఆయనకు వివరించారు. శేఖర్ మాస్టర్ తో కలిసి ఫొటోలు దిగేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

# ఘనంగా ఉపాధ్యాయులు థీమాటిక్ యోగా



ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ






యోగాంధ్ర-2026 కార్యక్రమాల పరంపరలో భాగంగా నేడు కాకినాడలో ఉపాధ్యాయుల థీమాటిక్ యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 900 మంది ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీమతి కర్రి పద్మశ్రీ, పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, కుడా ఛైర్మన్ తలాటం సత్య, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఇతర జిల్లా స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, విద్యార్థుల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడంలో వారి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సతీష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో 15 మంది యోగా గురువులు, యోగా ట్రైనర్లు, పీఈటీలు మరియు ఏఎన్ఎంలు విశేషంగా సేవలందించారు. కామన్ యోగా ప్రోటోకాల్ ను జేఎన్టీయూ యోగా విభాగానికి చెందిన డా. సుధా, ఆర్ట్ ఆఫ్ లివింగ్కు చెందిన కృష్ణమోహన్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సమన్వయంతో నిర్వహించగా, పాల్గొన్న ఉపాధ్యాయులు ఉత్సాహంగా యోగా సాధన చేశారు. సామూహిక యోగా ప్రదర్శనలు, కామన్ యోగా ప్రోటోకాల్ అభ్యాసం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు పాల్గొన్న వారిని ఆకట్టుకున్నాయి. యోగాంధ్ర-2026 లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లాలోని ప్రజలందరికీ పిలుపునిస్తూ, యోగాంధ్ర-2026లో భాగంగా కొనసాగుతున్న సిటిజన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఆసక్తి గల వారు తమ సమీపంలోని గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు మరియు ఎంపీడీవో కార్యాలయాలను సంప్రదించి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, జూన్ 14 వరకు నిర్వహించబడుతున్న గ్రామ స్థాయి మరియు మండల స్థాయి యోగా పోటీలలో అన్ని వయస్సుల వారు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు, నమోదు సౌకర్యం సంబంధిత గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు మరియు ఎంపీడీవో కార్యాలయాలలో అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మహిళ ఆర్థికంగా బలపడితేనే కుటుంబం బలపడుతుంది

- మహిళల సాధికారతకు ఆర్థిక స్వావలంబననే బలమైన పునాది.
- ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది..
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని కుటుంబం బలపడితేనే సామాజం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. గొల్లపూడిలోని రైజ్ సెంటర్లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్పై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వ చేసి పౌడర్ రూపంలో ప్రాసెస్ చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మహిళలు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణలు మహిళలలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు సోలార్ డ్రైయింగ్ ప్రక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై మహిళలకు వివరించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి. నాంచారరావు, అగ్రో ఎంటర్ప్రైజెస్ ప్రతినిధి పవన్కుమార్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, రైజ్ సెంటర్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానములో రుద్ర హోమం



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు


పాలకొల్లు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు శనివారం మాస శివరాత్రి సందర్భంగా రుద్ర హోమం పూజలు 9 టిక్కెట్లు గాను 9 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో హోమం పూజలు జరుపుకున్నారు. అభిషేక పండిట్టు బమ్మిడిపాటి వెంకన్న భక్తులచే పూజలు జరిపించినారు. సాయంత్రం 6 గంటలకు లీలా కళ్యాణం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు సూపరెన్టెంట్ వాసు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మందేశ్వర స్వామి ఆలయానికి భక్తుల వెల్లువ

శని త్రయోదశి సందర్భంగా వేలాదిమంది పూజలు.

దేవస్థానానికి రూ.31 లక్షల ఆదాయం.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



శని త్రయోదశి పర్వదినం సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా మందపల్లి శ్రీ మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి భక్తజనం పోటెత్తారు. వేకువజామునుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శనిదోష నివారణకు శ్రీ స్వామి వారికి తైలాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వ హణాధికారి, సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు మంచినీరు, చంటిపిల్లలకు, వృద్ధులకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా క్యూలైన్లలో కూలర్లు ఏర్పాటు చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించినట్లు అంచనా. ఈ నేపథ్యంలో ముఖమండపంలో నిర్వహించిన సేవల ద్వారా రూ.12,24,300, శనిత్రయోదశి తైలాభిషేకాల ద్వారా రూ.6,06,750, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.1,21,200, ఫోన్పే ద్వారా రూ.2,95,880 వెరసి మొత్తం ప్రత్యక్ష ఆదా యం రూ.22,48,130 సమకూరింది. ఇక పరోక్ష పూజల ద్వారా రూ.8,63,800, అన్నప్ర సాదం విరాళాల రూపంలో రూ.46,646 లభించాయి. దీంతో శనిత్రయోదశి సందర్భంగా దేవస్థానానికి మొత్తం రూ.31,58,576 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. శని త్రయోదశి రోజున ఈ స్థాయిలో భక్తులు రావడం ఇదే తొలిసారి అని చెప్పారు.

## రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు

జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాతలను సన్మానించిన జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం

రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన రక్తదాతలు, స్వచ్ఛంద సేవకులను సత్కరించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 14న నిర్వహించడం వెనుక శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్స్టీనర్ సేవలు ఉన్నాయని తెలిపారు. రక్త గ్రూపుల వ్యవస్థను కనుగొనడం ద్వారా ఆధునిక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఆయనకు నోబెల్ బహుమతి లభించిందన్నారు. రక్త గ్రూపుల గుర్తింపు లేకముందు రక్త మార్పిడి ప్రక్రియలో అనేక సమస్యలు ఎదురయ్యేవని, ఆయన పరిశోధనలు వైద్యరంగానికి ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు. రక్తదానం అనేది ఒక గొప్ప మానవతా సేవ అని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని కలెక్టర్ అన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న వారందరూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పట్టణ ప్రాంతాల్లో రక్తదానం ఒక సామాజిక బాధ్యతగా, అలవాటుగా మారిందని, అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృత స్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. జిల్లాలో త్వరలోనే పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా రక్తదానం పట్ల మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి రక్తదాత తాను రక్తదానం చేసిన విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడంతో పాటు మరో వ్యక్తిని కూడా రక్తదానానికి ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి సారి రక్తదానం చేసేటప్పుడు కనీసం ఒక కొత్త రక్తదాతను తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు వస్తే జిల్లాలో రక్తదాతల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. అలాగే బాంబే బ్లడ్ గ్రూప్ వంటి అరుదైన రక్త గ్రూపులు కలిగిన దాతల వివరాలతో ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటు చేయడం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అత్యవసర సమయాల్లో అరుదైన రక్తం అందుబాటులోకి రావడానికి ఇటువంటి వ్యవస్థ ఉపయోగపడుతుందని తెలిపారు. రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృష్ణా జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ డీపీటీఓ, కె. వెంకటేశ్వర్లు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి. కరుణ కుమార్, నందివాడ మండల ఎంఆర్ఓ ఎన్. గురుమూర్తి రెడ్డి, డీఆర్ఓ, సిసి తూము వెంకటేశ్వరరావు, కస్తూరి విజయకుమార్ (చల్లపల్లి రక్తదాత), రక్తదాతల ప్రోత్సాహకుడు (డోనర్ మోటివేటర్) వి. నవీన్ కుమార్, లేబాక వెంకటేశ్వరరావును జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డిఆర్కె ప్రసాద్, జనరల్ సెక్రెటరీ బి శంకర నాథ్, ట్రెజరర్ బి సుకుమార్, జిల్లా మలేరియా వైద్య అధికారి డాక్టర్ వెంకటరావు, రక్తదాతలు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు.. గొడ్డలివేటుకు

# బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి

- ఐదేళ్ల దగాకోరు పాలనపై గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నిప్పులు
- అధికారంలోకి వచ్చాక హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజలను వంచించారు
- పరిశ్రమలను తరిమేసి, ఉద్యోగ నోటిఫికేషన్లపై మడమ తిప్పి యువతను మోసం చేశారు
- అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పాడుబెట్టి రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారు
- కూటమి పాలనలో సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన సాగుతోంది
- జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

మంగళగిరి/ప్రజాభూమి ప్రతినిధి

ప్రజలిచ్చిన అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డిని మించిన వెన్నుపోటు దారుడు రాష్ట్రంలో మరొకరు లేరని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. గొడ్డలి వేటుకు, వెన్నుపోటుకు జగన్ రెడ్డే బ్రాండ్ అంబాసిడర్ అని దుయ్యబట్టారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల జగన్ అరాచక పాలనను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రగతిని వివరించారు.మద్యం, విద్యుత్ పేరుతో రూ.వేల కోట్ల దోపిడీసంపూర్ణ మద్య నిషేధాన్ని గాలికి వదిలేసి, కల్తీ బ్రాండ్లు, సొంత బ్రాండ్లతో తాడేపల్లి ఖజానా నింపుకున్నారు. సుమారు రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. జగన్ రెడ్డి కల్తీ మద్యంతో 30 వేల మందికి పైగా మహిళల మాంగళ్యాలు తెగాయి. విద్యుత్ ఛార్జీలు 9 సార్లు పెంచి రూ.32 వేల కోట్ల భారం ప్రజలపై వేశారు. పీపీఏలు రద్దు చేసి విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్ల నష్టం



చేకూర్చారు.అని మంత్రి మండిపడ్డారు.యువతకు, బడుగు బలహీన వర్గాలకు ద్రోహంమెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను వంచించారని, జగన్ రెడ్డి దగాకోరు మాటల వల్ల ఐదేళ్లలో 4,100 మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మఒడిని కొందరికే పరిమితం చేశారని, జీవో నెం.117 తెచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల స్కూళ్లను రద్దు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ జీవోను రద్దు చేసి బడుగు వర్గాల చదువులకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. అలాగే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కుదించి, అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తప్పి వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు.

**సొంత కుటుంబానికే వెన్నుపోటు!**

బాబాయి హత్య కేసులో నిందితులకు కొమ్ము కాస్తూ తోడబుట్టిన చెల్లిపైనే తిరిగి నిందలేశారని మంత్రి విమర్శించారు. తండ్రి ఆస్తిలో వాటా అడిగినందుకు తోడబుట్టిన చెల్లిని, ఆమెకు అండగా నిలిచినందుకు కన్న తల్లిని ఇల్లు వదిలి వెళ్లేలా చేశారని, సొంత కుటుంబానికే వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్ ది అని దుయ్యబట్టారు.

**కూటమి ప్రభుత్వంలో 'సూపర్ సిక్స్'.. సూపర్ హిట్!**

కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చిత్త శుద్ధితో పనిచేస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వ సంక్షేమం - ప్రగతి సూచికలు

పరిశ్రమలకు రెడ్ కార్పెట్: 25కి పైగా కొత్త పాలసీలు తెచ్చాం. రెండేళ్లలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25% ఏపీకే వచ్చాయి.

ఉద్యోగాల విప్లవం: 16,400 పోస్టులతో మెగా డీఎస్సీ, 6,000 కానిస్టేబుల్ ఉద్యోగాలిచ్చాం. 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం.

ఉచిత రవాణా & గ్యాస్: దీపం-2 పథకం ద్వారా 4.26 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ద్వారా 71 కోట్ల మంది లబ్ధి.

పేదల ఆకలి తీరుస్తూ: రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్ల పున:ప్రారంభం.

చేతివృత్తులకు అండ: గీత కార్మికులకు వైన్ షాపుల్లో 10% రిజర్వేషన్, వడ్డెరలకు క్వారీల్లో 33% రిజర్వేషన్.

ఉచిత విద్యుత్: నాయీ బ్రాహ్మణ, రజక, చేనేత మరమగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్.

గృహ నిర్మాణం: జగన్ ఇళ్ల పేరుతో రూ.7,000 కోట్లు దోచుకుంటే, కూటమి ప్రభుత్వం ఇప్పటికే 5 లక్షల ఇళ్లు ఇచ్చింది.ఆ 'గొడ్డలి పార్టీని' రాజకీయంగా భూస్థాపితం చేద్దాం!విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం కంటే.. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో జరిగిన నష్టమే అత్యంత దారుణమని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు.

ఐదేళ్ల అరాచకాలను చూసే ప్రజలు జగన్ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారు. అయినా సిగ్గులేకుండా ఇంకా కుట్రలనే నమ్ముకుని, మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నీచమైన కుతంత్రాలకు పాల్పడుతున్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. క్రూర మనస్తత్వం కలిగిన జగన్ రెడ్డి లాంటి దుర్మార్గులను రాజకీయంగా సమాధి చేయాలి. ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఈ పార్టీని భూస్థాపితం చేయాలి అని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.



## క్షణక్షణం నరకప్రాయం.. ఎప్పుడు కూలుతుందో తెలియని విద్యుత్ స్తంభాలు

**ఆక్వా రైతుల ప్రాణాలతో చెలగాటం..**
**పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు**
**మచిలీపట్నం మండలంలోని వెంకట దుర్గాంబ పురంలో దారుణ పరిస్థితి**



మచిలీపట్నం/ప్రజాభూమి రూరల్

అవి 1992లో నిర్మించిన విద్యుత్ స్తంభాలు.. అంటే దాదాపు 34 ఏళ్ల నాటివి. నాటి నుండి నేటి వరకు ఆ స్తంభాలకు మరమ్మతులు లేవు, కనీసం పట్టించుకున్న నాథుడే లేడు. ఫలితంగా నేడు అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి, ఎప్పుడు ఏ ప్రాణాన్ని బలితీసుకుంటాయో తెలియని మృత్యు పాశాలుగా మారాయి. మచిలీపట్నం మండలంలోని వాడపాలెం పంచాయతీ పరిధిలో గల వెంకట దుర్గాంబ పురంలో విద్యుత్ స్తంభాల దుస్థితిపై ఆక్వా రైతులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. 34 ఏళ్ల క్రితం నాటి వ్యవస్థ.. నేడు అస్తవ్యస్తంగ్రామంలో దాదాపు 228 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఆక్వా చెరువులకు ఈ లైన్ల ద్వారానే విద్యుత్ సరఫరా జరుగుతోంది. 1992వ సంవత్సరంలో కాసా (CASA) మరియు డిఆర్డిఏ (DRDA) ఆధ్వర్యంలో ఇక్కడి ఆక్వా రైతుల కోసం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి, అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లను నెలకొల్పారు. అయితే, ముప్పై ఏళ్లు దాటినా వీటిని ఆధునీకరించకపోవడంతో స్తంభాలన్నీ పూర్తిగా అరిగిపోయి, లోపలి ఇనుప చువ్వలు బయటపడి పెచ్చులూడిపోతున్నాయి.ట్రాన్స్‌ఫార్మర్ల వద్దే 'హై ఓల్టేజ్' ప్రమాదం!మరీ ముఖ్యంగా ఎక్కడైతే భారీ విద్యుత్ సరఫరా జరిగే ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయో, సరిగ్గా అక్కడే స్తంభాలు మరీ దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతాల్లోకి వెళ్లాలంటేనే రైతులు వణికిపోతున్నారు. చిన్న గాలివాన వచ్చినా, లేదా సాంకేతిక లోపం తలెత్తినా ఈ స్తంభాలు కూలిపోతే జరిగే ఆస్తి, ప్రాణ నష్టానికి బాధ్యులెవరని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతుల ఆవేదన: మొరపెట్టుకున్నా చలనం లేదుమేము చెరువుల వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. క్షణక్షణం నరకం చూస్తున్నాం. శిథిలమైన స్తంభాల స్థానంలో కొత్తవి వేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. వినతి పత్రాలు ఇచ్చాం. కానీ, అధికారుల తీరు 'గోడకు కొట్టిన సున్నం'లా ఉంది. మా ప్రాణాలకు కనీస విలువ ఇవ్వడం లేదు అని వెంకట దుర్గాంబ పురం ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్పందించండికోట్లాది రూపాయల విదేశీ మార్పిడిని దేశానికి అందిస్తూ, ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న ఆక్వా రైతుల ప్రాణాలతో అధికారులు ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం తగదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, వెంకట దుర్గాంబ పురంలో ఉన్న పాత, శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన స్తంభాలను, సురక్షితమైన వైర్లను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే.. ప్రమాదాన్ని ముందే నివారించడం ఉత్తమమని పత్రికా ముఖంగా హెచ్చరిస్తున్నారు.

## ఈనెల 21న నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు..

**యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ముఖ్యమంత్రి..**
**అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి..**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఈ నెల 21వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.ఈ నెల 21న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎం. రాజశేఖర్ బాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తదితరులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సుమారు 5,000 మంది యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజలు యోగా ఆసనాల్లో పాల్గొనేందుకు రానున్నరన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక వర్షం కురిసే అవకాశం ఉంటే కార్యక్రమాన్ని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, యోగా సాధకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పూర్తి చేసి, ప్రాంగణాన్ని సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# జీవితాన్ని క్రమశిక్షణతో నడిపించే శక్తి యోగా ఇస్తుంది

**యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సామాజ నిర్మాణమే లక్ష్యం..**
**యోగాసనాలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోండి : జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన సామాజ నిర్మాణమే లక్ష్యమని ప్రతి ఒక్కరూ రోజు యోగాసనాలను ఆచరించి ఆరోగ్యంగా ఉండాలని, జీవితంలో యోగాన్ని ఒక భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం భవానిపురంలోని బెరం పార్కు నందు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆయుష్ కమిషనర్ గోపాలకృష్ణ, నగర మున్సిపల్ కమిషనర్ హెచవం ధ్యాన చంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా పాల్గొన్ని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర ఒక ఉద్యమంలా రూపుదిద్దుకుని ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని కలిగిస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందుతుందన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎన్టీఆర్ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక యోగా కార్యక్రమాల నిర్వహణతో పాటు విద్య సంస్థలు ప్రభుత్వ కార్యాలయాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. ఆయుష్ శాఖ నిపుణులు రూపొందించిన కామన్ యోగా ప్రోటోకాల్‌లోని ఆసనాలు సులభంగా ప్రతి ఒక్కరూ చేయగలవని కలెక్టర్ తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు యోగా చేయవచ్చని చెప్పారు. రోజుకు కేవలం 40 నుంచి 45 నిమిషాల సమయం కేటాయించి యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఊబకాయం, హార్మోన్ల అసమతుల్యత, మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్ వంటి జీవనశైలి వ్యాధులను నివారించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆలోచనలు, పనిలో సామర్థ్య వృద్ధి, జీవితంలో సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు.యోగాంధ్ర కార్యక్ర మాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, శిక్షకులు, విద్యాసంస్థలు, పౌర సమాజ ప్రతినిధులు, ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో డిఎం అం డ్ హెచ్‌వో డా. జె. ఇందుమతి, జిల్లా ఆయుష్ అధికారి డా. వై రత్న ప్రియదర్శిని, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, డిఆర్‌డిఏ పిడి ఏన్‌వి నాంచారరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కె. రమేష్, వివిధ శాఖల చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# కంటి చూపును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత..



**శుక్లాల సమస్యకు శస్త్రచికిత్సే శాశ్వత పరిష్కారం..**
**ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.. : జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుక్లాల (ముత్యబిందు) కారణంగా చూపు మందగించిన వారు ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శంకర నేత్రాలయ వైద్యులు డా. మాధవ్, డా. అపర్ణల ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరా నికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనిషికి ప్రకృతి ప్రసా దించిన అత్యంత విలువైన వరాల్లో కనుచూపు ఒకటని అన్నారు. కంటి చూపు ద్వారా మనం ప్రపంచాన్ని దర్శించగలుగుతామని, విద్యా భ్యాసం, ఉపాధి, దైనందిన కార్యకలాపాలు, సామాజిక జీవనం సజావుగా సాగేందుకు చూపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ చాలామందిలో శుక్లాలు (ముత్యబిందు) ఏర్పడడం సహజమని తెలిపారు. శుక్లాలు వచ్చి న ప్పుడు వస్తువులు మసకగా కనిపించడం, చదవడంలో ఇబ్బంది కలగడం, వెలుతురు పట్ల అసౌకర్యం, రాత్రివేళల్లో సరిగా కనిపించకపోవడం, రంగులను స్పష్టంగా గుర్తించలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే చూపు మరింత తగ్గిపోయి సాధారణ జీవనం కూడా కష్టతరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. శుక్లాలకు ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన చికిత్స శస్త్రచికిత్సేనని కలెక్టర్ తెలిపారు. శస్త్రచికిత్స ద్వారా మసకబారిన కంటి లెన్స్‌ను తొలగించి, దాని స్థానంలో కృత్రిమ లెన్స్‌ను అమర్చడం వల్ల చూపు గణనీయంగా మెరుగుపడుతుందని చెప్పారు.

**శుక్లాల శస్త్రచికిత్స వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు:**

చూపు స్పష్టంగా, మెరుగ్గా కనిపించడం. చదవడం, నడవడం, టెలివిజన్ చూడడం వంటి పనులు సులభంగా చేయగలగడం. స్వయం ఆధారిత జీవనం కొనసాగించే అవకాశం పెరగడం. పడిపోవడం, ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు తగ్గడం. ఆత్మవిశ్వాసం, జీవన నాణ్యత పెరగడం. కుటుంబ సభ్యులపై ఆధారపడే అవసరం తగ్గడం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందుబాటులో ఉన్నాయని, కంటి చూపు సమస్యలు ఉన్న వారు సమీప ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కోరారు. శిభిరానికి సంబంధించి ఇతర వివరాలకు 9440029999 నంబర్ నందు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డా. వెలగ జోషి, సెక్రటరీ సీహెచ్. చిట్టిబాబు, సభ్యులు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWARPUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677.